E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 20-03-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక:77 || పేజీలు–6

www.ekaburu.com

## కార్మిక వర్గానికి వ్యతిరేకం కాదు



- సుప్రీంకోర్టుకు తెలియజేసిన కేంద్ర ప్రభుత్వం
- 'ఇండస్ట్రీ'పదానికి విస్తృత అర్థంపై తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం

ఈ కబురు,న్యూఢిల్లీ: కార్మిక వర్గానికి తాము ఎంతమాత్రం వ్యతిరేకం కాదని కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు సుప్రీంకోర్టుకు తెలియజేసింది.

02

# గల్ఫ్ గజగజ



- 17 శాతం ఉత్పత్తి కేంద్రాలు బుగ్గి?
- భారీ నష్టం, కోలుకునేందుకు ఐదేళ్లు!
- రూ. 2.4 లక్షల కోట్లు అవసరం!
- అక్కడినుంచే మనకు ఎల్ఎన్‌జీ
- సౌదీ అరాంకోపైనా ఇరాన్ దాడులు
- కువైట్, అబుదాబి క్షేత్రాలపైకి డ్రోన్లు
- వాటిని నాశనం చేస్తామని హెచ్చరిక
- అప్పుడు సౌత్ పార్స్ క్షేత్రం బుగ్గే!
- ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం
- యుద్ధరంగంలోకి సౌదీ అరేబియా?

## గల్ఫ్ ఇంధన వనరులే లక్ష్యం.. మంటల్లో ఖతర్ ఎల్ఎన్‌జీ క్షేత్రం



ఈ కబురు, దుబాయ్: పశ్చిమాసియా యుద్ధం ప్రపంచ ఇంధన భద్రతను నానాటికీ పెను ప్రమాదంలోకి నెడుతోంది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ సహజవాయు క్షేత్రంపై చేసిన ఇజ్రాయెల్ దాడి తీవ్ర విపరిణామాలకు దారి తీస్తోంది. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్ గురువారం గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలన్నింటికీ నిప్పు పెట్టే ప్రయత్నం చేసింది! ఖతర్, సౌదీ అరేబియా, కువైట్, అబుదాబి సహా పలుచోట్ల చమురు, సహజవాయు క్షేత్రాలపై ఎడాపెడా క్షిపణి, డ్రోన్ దాడులకు దిగింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా పెను కల్లోలం చెలరేగింది. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఎల్ఎన్‌జీ క్షేత్రమైన ఖతర్‌లోని రస్ లఫాన్ ఇరాన్ దాడుల్లో భారీగా దెబ్బ తిన్నది. అక్కడి ఉత్పత్తి కేంద్రాల్లో 17 శాతం మేరకు బుగ్గిపాలైనట్టు ఖతర్ ప్రకటించింది. "ఇది అంచనాలకు అందనంతటి భారీ నష్టమిది! దీన్నుంచి కోలుకునేందుకు కనీసం మూడు నుంచి ఐదేళ్ల సమయం, రూ.2.4 లక్షల కోట్ల (26 బిలియన్ డాలర్ల) నిధులు అవసరం!" అని ఖతర్ ఎనర్జీ సీఈఓ సాద్ అల్ కాబి పేర్కొన్నారు! భారత ఎల్ఎన్‌జీ అవసరాలను సగానికి సగం రస్ లఫాన్ క్షేత్రమే తీరుస్తోంది. దాంతో ఈ దాడి ప్రభావం మనపై తీవ్రంగా ఉండనుంది!!

మిగతా 3లో



4

## మార్కెట్‌కు చమురు మంటలు.. సెన్సెక్స్ 2497 పాయింట్లు పతనం

- రూ.12.87 లక్షల కోట్ల సంపద ఉఫ్
- సెన్సెక్స్ 2,497 పాయింట్లు డౌన్
- ఒక దశలో 23,000 దిగువకు నిఫ్టీ
- 2024 జూన్ తర్వాత అతి పెద్ద పతనం



2

## కూటమి ప్రభుత్వ సంకల్పం సిద్ధిస్తుంది

- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో రాష్ట్రాభివృద్ధి
- శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలి
- తెలుగుజాతి నెంబర్-1 అవుతుంది
- స్వార్థంతో తల్లికీ, చెల్లికి ఆస్తులివ్వని వ్యక్తులున్నారు

## సారు అసెంబ్లీకి వస్తారా? ఎత్తిన జీతం తిరిగిచ్చేస్తారా?



గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

02

## ఇంధన వనరులపై దాడులా?

- వ్రంగా ఖండించిన భారత్
- చర్చలు, దౌత్యమే మార్గం: మోదీ
- యుద్ధ పరిణామాలపై ఆందోళన
- ఒమన్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేసియా అధినేతలతో సంభాషణ


ఈకబురు,న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కీలక ఇంధన వనరులపై దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. "ప్రపంచమంతటినీ ఎంతగానో కలతకు గురి చేసే అంశమిది. ఇప్పటికే ఒడిదొడుకుల్లో ఉన్న అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌ను ఈ దాడులు మరింతగా దెబ్బ తీస్తాయి''అంటూ ఆందోళన వెలిబుచ్చింది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ దాడి, ప్రతీకారంగా ఖతర్‌లోని ఎల్ఎన్‌జీ క్షేత్రం రస్ లఫాన్‌తో పాటు సౌదీ అరేబియాలో అతి పెద్ద చమురు క్షేత్రమైన ఆరాంకోపైనా ఇరాన్ దాడులు కలకలం రేపడం తెలిసిందే.

మిగతా 2లో



# రూ.3.35 లక్షల కోట్లు?

ఈ-కబురు, హైదరాబాద్: ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈసారి భారీ బడ్జెట్ ప్రవేశపెట్టబోతోంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.3.35 లక్షల కోట్ల వరకు అంచనాలతో ప్రతిపాదనలను శుక్రవారం అసెంబ్లీ ముందుంచనున్నట్టు తెలుస్తోంది. ఆరు గ్యారంటీల అమలుకు తోడు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశలో వీటిని ఖరారు చేసినట్టు సమాచారం.



- ఈసారి భారీగా రాష్ట్ర బడ్జెట్
- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- గత ఏడాది అంచనాల కంటే 10 శాతం పెరుగుదల!
- 2034 విజన్‌కు అనుగుణంగా ప్రతిపాదన
- సంక్షేమానికే పెద్దపీట.. రూ.లక్ష కోట్లకు పైగానే కేటాయింపు
- విద్య, వైద్యం, వ్యవసాయానికీ ప్రాధాన్యం
- పాత పథకాల కొనసాగింపు.. ఆరు కొత్త పథకాలు!
- స్థిరంగా పెరుగుతున్న పన్ను ఆదాయానికి తోడు ఇతర మార్గాలపై భరోసా
- కేంద్ర పన్నుల్లో వాటా, ప్రాయోజిత పథకాల ద్వారా నిధులు పెరుగుతాయని అంచనా

02



## ప్రతి రైతుకు.. ఒక ఎకరానికి..!

- తొలి విడత రైతుభరోసాకు నిధులు విడుదల చేయనున్న సర్కారు
- ఎన్ని ఎకరాలున్నా మొదట ఒక ఎకరంలోపు విస్తీర్ణానికి పెట్టుబడి సాయం
- మొత్తం 73 లక్షల మంది రైతులకు రూ.3,590 కోట్లు

02

## రైతును రాజుగా నిలబెట్టాల్లన్నదే మా సంకల్పం

- ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్
- భూ భారతితో రైతాంగ సమస్యలను పరిష్కరిస్తున్నాం
- సాదా బైనామాకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నాం
- సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైతాంగాన్ని గట్టెక్కిస్తాం
- మన పొలాల్లో సమృద్ధిగా పంటలు పండినప్పుడే రాష్ట్రం సుఖశాంతులతో విలసిల్లుతుంది
- పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ కూడా ఇచ్చి ఆదుకుంటున్నాం; సిఎం రేవంత్



ఈ కబురు, హైదరాబాద్ : తెలంగాణలో సాదా బైనామా భూములకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభదినం సందర్భంగా ప్రకటించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతును రాజుగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతి శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో

మిగతా 2లో



## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు

ఈ కబురు : పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాలను నిశితంగా రిశీలిస్తున్నామని భారత ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుత పరిస్థితులు కేవలం దేశానికే కాకుండా, యావత్ ప్రపంచానికి పరీక్షగా మారాయని పేర్కొంది

03

## గ్లోబల్ సినీ హబ్‌గా తీర్చిదిద్దుతాం..

- సినీ పరిశ్రమకు సింగిల్ విండో విధానం
- తెలంగాణ గద్దర్ సినీ అవార్డులు–2025 ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- చిత్ర పరిశ్రమకు గమ్యస్థానంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం
- సామాజిక సమస్యలపరిష్కారానికి సినిమాలు దోహదపడాలన్న ముఖ్యమంత్రి

ఈకబురుహైదరాబాద్: సినీ పరిశ్రమకు సంబంధించిన అన్ని అనుమతులు ఒకే దగ్గర లభించేలా సింగిల్ విండో విధానాన్ని తీసుకువస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. కేవలం స్టోరీతో సంప్రదిస్తే సినిమా పూర్తి చేసుకుని రీల్‌తో వెళ్లే విధంగా వెంట వెంటనే జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఐటీ, ఫార్మా పరిశ్రమకు సమానంగా సినీ పరిశ్రమను గుర్తించామని, చిత్ర పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. గురువారం హైటెక్స్‌లో తెలంగాణ గద్దర్ సినీ అవార్డులు–2025 ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు.

### ఆ నలుగురు చార్ మినార్ల వంటివారు..

'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఇవ్వడం మా ప్రభుత్వం బాధ్యతగా భావించింది. హైదరాబాద్ అంటే కేవలం ఐటీ హబ్, బిర్యానీ మాత్రమే కాదు.. ఇదొక సినిమా హబ్‌కు కేరాఫ్ అడ్రస్. భారతీయ సినీ పరిశ్రమకు గమ్యస్థానంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌కు చార్మినార్‌లోని చార్ మినార్ల లాగా ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు, కృష్ణ..ఈ నలుగురు సినీ పరిశ్రమను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు.



02



## నా పోరాటం ముగ్గురిపైనే: కవిత

- నేను దూరమయ్యాక నిజామాబాద్‌లో బీఆర్ఎస్ బాగా నష్టపోయింది
- వనపర్తి నుంచి పోటీ చేయమని కార్యకర్తలు కోరుతున్నారు
- బీఆర్ఎస్‌తో నాకున్న విభేదాలను రేవంత్ రెడ్డి అవకాశంగా చేసుకుంటున్నారు

03

# ఇంధన వనరులపై దాడులా?



ఇవి భారత్‌ను తీవ్రంగా కలచివేసినట్టు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. పౌర సదుపాయాలు, ఇంధన వనరులపై దాడులు కూడదని భారత్ ముందునుంచీ చెబుతూనే వస్తోందని గుర్తు చేశారు. వాటికి తక్షణం తెర దించాలని గురువారం మీడియా సమావేశంలో ఆయన సూచించారు. భారత ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో 40 శాతానికి పైగా ఖతర్ నుంచి వస్తుండటం తెలిసిందే.

**దాడులు గర్హనీయం: మోదీ**

పశ్చిమాసియా తాజా పరిణామా లపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ఈ విషయమై పలువురు దేశాధినేతలతో ఆయన వేర్వేరుగా సంభాషించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిఖ్, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, జోర్డాన్ రాజు అబ్దుల్లా-2తో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో తాజా పరిస్థితులను గురించి వారితో లోతుగా చర్చించారు. ఇంధన వ్యవస్థలపై దాడులు తీవ్రంగా గర్హనీయమన్నారు. ఉద్రిక్తతలకు తక్షణం తెర దించి శాంతి, సుస్థిరత పాదుగొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హార్మూజ్ జలసంధి గుండా సురక్షిత నౌకాయాన్ని తక్షణం పునరుద్ధరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. వీటన్నింటికీ దౌత్యం, మధ్యవర్తిత్వమే మార్గాలని స్పష్టం చేశారు. ఆ దిశగా జరిగే ప్రయత్నాలకు భారత్ అన్నివిధాలా మద్దతుగా నిలుస్తుందని మోదీ స్పష్టం చేశారు. అధినేతలతో చర్చలు ఫలప్రదంగా సాగినట్టు ఎక్స్ పోస్టుల్లో ఆయన వెల్లడించారు. పశ్చిమాసియా విషయమై ఆందోళనలతో వారంతా ఏకీభవించినట్టు తెలిపారు. ''అబ్దుల్లా-2, తారిఖ్‌తో చర్చల సందర్భంగా జోర్డాన్, ఒమన్ ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపా. ఇంధన వనరుల పై దాడులను ఖండించా''అని తెలిపారు. గత ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం మొదలైనప్పటి నుంచి ఒమన్, జోర్డాన్ అధినేతలతో మోదీ సంభాషించడం ఇది రెండోసారి. అణ్వాయుధాల వ్యాప్తికి, అధునాతన క్షిపణి వ్యవస్థల విస్తరణకు పాకిస్తాన్ గుట్టుచప్పుడు కాకుండా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉందంటూ ఒక నివేదికలో అమెరికా నిఘా వర్గాలు వెలిబుచ్చిన ఆందోళనతో భారత్ ఏకీభవించింది. ''ఇలాంటి వేషాలు పాక్‌కు కొత్త కాదు. ఆ దేశం నైజమే అంత'' అంటూ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌దీర్ జైస్వాల్ గురువారం ఎద్దేవా చేశారు. ''ప్రపంచానికి పాక్ ఎంత ప్రమాదకరమో అందరికీ తెలుసు. అమెరికా నివేదిక ఆ వాస్తవాన్ని మరోసారి అందరి ముందూ ఉంచంది'' అని అభిప్రాయపడ్డారు.

## సారు అసెంబ్లీకి వస్తారా?

# ఎత్తిన జీతం తిరిగిచ్చేస్తారా?



ఈ కబురు, హైదరాబాద్ ;

రాష్ట్రంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. రేపు ఉదయం ఆర్థికశాఖమంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అయితే, ప్రభుత్వం ఏదైనా ప్రతిపక్ష నేత బడ్జెట్ సమావేశాలకు హాజరవ్వాలి. బడ్జెట్‌లో ఏమైనా తప్పులు దొర్లితే వాటిని సవరించాలి. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలి.కానీ, అధికారం కోల్పోయిన నాటి నుంచి మాజీ సీఎం, గులాబీ బాస్ సభకు రావడం లేదు. కేవలం రెండు సార్లు అసెంబ్లీకి హాజరై రిజిస్టర్ బుక్‌లో సంతకం చేసి వెళ్లిపోయారు. అటెండెన్స్ లేకపోతే శాసన సభ సభ్యత్వం రద్దువుతుందనే ఆయన హాజరు వేసుకుని వెళ్తున్నారని అధికారపార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారు. గత రెండేండ్లుగా ఒక్క బడ్జెట్ సెషన్‌లో నూ కేసీఆర్ లేకపోవడం గమనార్హం.

--సభకు రాకపోతే హోదా ఎందుకు?

కేసీఆర్ పదేండ్లు తెలంగాణ ముఖ్యమంత్రిగా పనిచేశారు. అధికారంలో ఉన్నప్పుడు సభకు హాజరైన ఆయన.. నాడు ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న ఆయన సభకు వచ్చి తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డికి సలహాలు, సూచనలు, తన అనుభవాన్ని పంచుకునే అవకాశం ఉన్నది. ప్రభుత్వం సైతం అదే ఆశిస్తున్నది. కానీ, కేసీఆర్ మాత్రం సభకు హాజరుకావడం లేదు. తన కంటే చిన్నవాడు ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు.. తన పరువుకు భంగం వాటిల్లుతుందని, లేదా రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు తనను ప్రశ్నలు అడిగితే చిన్నతనంగా ఫీల్ అయ్యే చాన్స్ ఉందేమో? అందుకే రావడం లేదని కొందరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.కాగా, సభకే రాని వారికి ప్రతిపక్ష హోదా ఎందుకు? అని పలువురు ప్రశ్నలు సంధిస్తున్నారు.

--జీతం తిరిగిచ్చేయాలి..

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో భాగంగా సీఎం రేవంత్ నిన్న సాయంత్రం కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బడ్జెట్ సెషన్‌కు అయినా కేసీఆర్ హాజరు కావాలని ఆయన కోరారు. ఒకవేళ సభకు రాకపోతే ఆయనకు ఎందుకు ప్రభుత్వం జీతం చెల్లించాలనే ప్రశ్నను లేవనెత్తారు. ఇప్పటివరకు కేసీఆర్ రూ.1.06లక్షల వేతనం తీసుకున్నారని.. కానీ సభకు, సమావేశాలకు హాజరుకావడం లేదన్నారు. అదంతా ప్రజల సొమ్మే అని.. విధులకు రానప్పుడు జీతం ఎందుకు అని ప్రశ్నించారు. ప్రజాసమస్యలపై మాట్లాడుతారనే కదా? ఆయన్ను ప్రజలు గెలిపించింది అని.. సభకు రాకుండా ఫాంహౌస్‌లోనే ఉంటే తనకు ఓట్లు వేసిన వారి సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. ఇక మీదట సభకు రాని సభ్యుల జీతాలు కట్ చేయడం లేదా తిరిగి వసూలు చేయడంపై ఆలోచన చేయాలని సీఎం తన అభిప్రాయాన్ని సభావేదికగా ప్రకటించారు. కాగా, దీనిపై కేసీఆర్ ఇంతవరకూ స్పందించలేదు. సీఎం రేవంత్ ఆహ్వానం మేరకు ఆయన బడ్జెట్ సమావేశాలకు హాజరవుతారా? లేక జీతం వెనక్కి తిరిగి ఇచ్చేస్తారా? ఏ నిర్ణయం తీసుకుంటారో అన్న చర్చ జరుగుతున్నది. ఒకవేళ జీతం తిరిగి ఇచ్చేయాలని కేసీఆర్ అనుకుంటే మరల అసెంబ్లీకి వచ్చే అవకాశం లేదని.. మరల ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పవర్‌లోకి వస్తే సీఎంగా సభలో అడుగుపెట్టే అవకాశాలు ఉన్నాయని.. లేదంటే క్రియాశీలక రాజకీయాలకు ఆయన గుడ్ బై చెప్పినట్టే అని ప్రచారం జరుగుతోంది.

# రూ.3.35 లక్షల కోట్లు?



స్థిరంగా పెరుగుతున్న పన్ను రాబడులను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు సమకూరుతాయని ప్రభుత్వం భావిస్తున్నట్టు ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించడంతో పాటు కొత్తగా ఆరు పథకాలను ప్రతిపాదిస్తూ, 2034 నాటికి నిర్దేశించుకున్న విజన్‌కు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలిపాయి. ఈసారి దూకుడు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతోంది. అయితే గత రెండు బడ్జెట్‌లలోనూ ఆచితూచి వ్యవహరించిన ప్రభుత్వం.. అనేక అంచనాలు, ఆశలతో ఈసారి దూకుడుగా వెళ్లాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. 2024-25లో రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించగా, 2025-26లో 5 శాతం పెంచి రూ.3.05 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించింది. అదే ఒరవడి కొనసాగితే 2026-27కు రూ.3.20 లక్షల కోట్ల వరకు ప్రతిపాదించే అవకాశముంది.

కానీ ఏకంగా 10 శాతం పెంపుతో బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. సొంత పన్నుల ఆదాయంపై నమ్మకంతో పాటు కేంద్ర పన్నుల్లో వాటా, ప్రాయోజిత పథకాల ద్వారా నిధుల సమీకరణ పెరిగే అవకశాముందనే అంచనాలు, భూముల అమ్మకాలు, భూముల విలువల సవరణల ద్వారా మరిన్ని నిధులు సమకూరతాయనే ఆలోచనతో రూ.3.35 లక్షల కోట్ల వరకు ప్రతిపాదించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

**అప్పుల పద్దూ భారీగానే..!**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బహిరంగ మార్కెట్ ద్వారా రూ. 64,539 కోట్లు సేకరించాలని నిర్ణయించగా, ఈసారి దాన్ని రూ.80 వేల కోట్ల వరకు ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక గత రెండు బడ్జెట్‌లలో భూముల అమ్మకాల ద్వారా నిధుల సమీకరణకు ప్రతిపాదనలు లేవు. కానీ ఈసారి అనివార్యమవుతోందని తెలుస్తోంది. అలాగే రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల విలువల సవరణ ద్వారా రూ.3 వేల కోట్ల వరకు అదనంగా ఆదాయాన్ని సమకూర్చుకునే ప్రతిపాదన కూడా చేయనున్నట్టు సమాచారం.

**రూ.50 వేల కోట్ల మూలధన వ్యయ ప్రతిపాదనలు**

విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనివ్వనున్నారు. అదే విధంగా మూలధన వ్యయాన్ని కూడా పెంచనున్నారు. 2025-26లో రూ.36 వేల కోట్ల మూల ధన వ్యయం అంచనా వేసినప్పటికీ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అది రూ.50 వేల కోట్లను చేరింది. ఈ నేపథ్యంలో ఈసారి ప్రతిపాదనలే రూ.50 వేల కోట్లకు చేరనున్నట్టు సమాచారం. 2025-26లో రూ.3.05 లక్షల కోట్ల బడ్జెట్‌కు గాను రూ.2.90 లక్షల కోట్ల వరకు సవరించిన అంచనాలుంటాయని భావిస్తూ ఈ మొత్తానికి మరో రూ.45 వేల కోట్లు కలిపి ఈసారి బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నట్టు సమాచారం.

అభిజిత్ లగ్నం..రేవతి నక్షత్రం

విజయ ముహూర్తంలో బడ్జెట్ ప్రవేశపెట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్ణయించారు. దీర్ఘకాలిక లక్ష్యాన్ని సాధించే దిశలో ఈసారి బడ్జెట్‌కు రూపకల్పన చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు రేవతి నక్షత్ర అభిజిత్ లగ్నం సమయంలో అసెంబ్లీ ముందుంచనున్నారు. దీనికి ముందు ఉదయం ప్రజాభవన్‌లోని పోచమ్మ ఆలయంలో భట్టి దంపతులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత అసెంబ్లీకి చేరుకోనున్న భట్టి.. మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్, సీఎంను మర్యాదపూర్వకంగా కలుస్తారు. 9:30 గంటలకు జరిగే కేబినెట్ సమావేశంలో బడ్జెట్‌కు ఆమోదం తీసుకున్న తర్వాత అసెంబ్లీలో ప్రవేశ పెడతారు. అదే సమయంలో శాసనమండలిలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పిస్తారు.

**పింఛన్లు, కల్యాణలక్ష్మి సాయం పెంపు**

ఈసారి బడ్జెట్‌లో ఎప్పటిలాగే సంక్షేమానికి పెద్దపీట వేసే అవకాశముందని తెలుస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మొదలు యంగ్ ఇండియా స్కూల్స్ వరకు అన్నిటి బడ్జెట్ రూ.లక్ష కోట్లు దాటనుంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతు భరోసా, సన్న బియ్యానికి బోనస్, సన్న బియ్యం పంపిణీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, చేయూత పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అన్ని పథకాలను కొనసాగించేందుకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించనున్నారు. అదే సమయంలో చేయూత పింఛన్లు రూ.500 చొప్పున పెంపు, కల్యాణలక్ష్మికి రూ.50 వేల అదనపు లబ్ధి ప్రతిపాదనలు చేసే అవకాశాలున్నాయి. వీటికి తోడు మరో ఆరు కొత్త పథకాలను కూడా ప్రకటిస్తారని సమాచారం. రాష్ట్రంలోని దరఖాస్తు చేసుకున్న ప్రజలందరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రకటిస్తారని, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం, యంగ్ ఇండియా కిట్స్, పారా అథ్లెట్లకు ఇళ్ల స్థలాలు, వృద్ధ అర్చకులకు పింఛన్లకు తోడు ఎన్నికల హామీలో భాగంగా విద్యార్థినులకు ఈవీ స్కూటర్లు అందించే కార్యక్రమానికి కూడా నిధులు కేటాయించనున్నట్టు తెలుస్తోంది.

# గ్లోబల్ సినీ హబ్‌గా తీర్చిదిద్దుతాం..





రామోజీరావు ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేసి హైదరాబాద్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారు.

ప్రభాకర్‌రెడ్డి సినీ కార్మికుల కోసం తన సొంత స్థలాన్ని ఇచ్చారు. ఆనాడు సినీ రంగంలో ఏ సమస్య వచ్చినా ముందుండే దాసరి నారాయణరావును కూడా స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్‌ను గ్లోబల్ సినీ హబ్ గా తీర్చిదిద్దేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇటీవల నెట్ ఫ్లిక్స్ తమ సంస్థను హైదరాబాద్ లో ఏర్పాటు చేసింది. నెట్ ఫ్లిక్స్ వచ్చిందంటే హైదరాబాద్‌కు హాలీవుడ్ వచ్చినట్టే. గద్దర్ ఒక చైతన్యం.. ఒక స్ఫూర్తి. తన పాటతో వేలాది మందిలో చైతన్యం తీసుకువచ్చిన ఆయన పేరుతో ఈ అవార్డులు ఇవ్వడం సంతోషం. సినిమా అనేది చాలా శక్తివంతమైన ఆయుధం. సమాజాన్ని చైతన్యపరిచేందుకు దీన్ని సాధనంగా ఉపయోగించుకోవాలి. సామాజిక బాధ్యతను గుర్తెరిగి గద్దర్ స్ఫూర్తితో సామాజిక సమస్యల పరిష్కారానికి సినిమా ద్వారా సందేశం అందించాలి..'అని సీఎం సూచించారు.

**సందేశాత్మక సినిమాలతో ప్రజల్లో మార్పు: డిప్యూటీ సీఎం**

'తెలంగాణ ఆత్మను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు గద్దర్. ఆయన పేరిట అవార్డులు ఇవ్వడం అంటే ప్రభుత్వ ఆలోచన ఏమిటో ప్రపంచానికి చెప్పడమే. తెలుగు చిత్ర పరిశ్రమ హాలీవుడ్ స్థాయికి ఎదిగింది. అనేక సందేశాత్మక సినిమాలు ప్రజల్లో మార్పునకు నాంది పలికాయి.

అయితే గత పాలకులు 10 ఏళ్ల పాటు సినిమా అవార్డులు ఇవ్వలేదు. కానీ తెలుగు సినిమా తెలంగాణకే పరిమితం కాకుండా ప్రపంచానికే తలమానికం కావాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి గద్దర్ పేరిట సినిమా అవార్డులను తిరిగి ప్రారంభించారు..'అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.

# రైతును రాజుగా నిలబెట్టాలన్నదే మా సంకల్పం



రవీంద్రభారతిలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారితో కలిసి పాల్గొన్నారు. శ్రీ పరాభవ నామ ఉగాది పంచాంగాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా భగవంతుడిని ప్రార్థించారు. ఈ నెల 22న రైతు భరోసా అందించబోతున్నామని తెలియజేస్తూ రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రైతు సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటిస్తూ.. "ధరణి రూపంలో భూతమై రైతులను బాధ పెడుతున్న సందర్భంగా రైతులకు అండగా దాన్ని తరిమేసి భూ భారతితో రైతాంగ సమస్యలను పరిష్కరిస్తున్నాం. సాదా బైనామాకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నాం. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైతాంగాన్ని గట్టెక్కించడానికి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ కూడా ఇచ్చి ఆదుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల మేరకు దేశంలో అతితక్కువ రుణభారం కలిగిన రైతులున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండటం గర్వకారణం. పరిశ్రమలు ఎన్ని వచ్చినా, ఐటీ రంగాలు ఎంతగా రాణించినప్పటికీ రాష్ట్రంలో ఇప్పటికీ ప్రధాన జీవనాధారం వ్యవసాయమే. రైతులు బాగున్నప్పుడే రాష్ట్రం బాగుంటుంది. రాష్ట్రంలో 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ. 20,616 కోట్ల మేరకు రుణమాఫీ చేసి రైతులను ఆత్మగౌరవంతో బతకడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. ప్రతి ఎకరాకు రూ. 12 వేల చొప్పున రైతు భరోసా అందిస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వం 18 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద అందించింది. పండించిన పంటలపై రైతుల్లో విశ్వాసం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. వ్యవసాయ రంగానికి ఉచిత కరెంట్, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, రుణమాఫీ చేయడం, రైతుభరోసా అందించడంతో పాటు రైతు బీమా అమలు చేయడం వంటివన్నీ రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలు. ప్రభుత్వం రైతుల కోసం ప్రయత్నాలు, నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలన్నీ దేశంలో తెలంగాణ ప్రతిష్టను పెంపొందిస్తాయి. మన పొలాల్లో సమృద్ధిగా పంటలు పండినప్పుడే రాష్ట్రం సుఖశాంతులతో విలసిల్లుతుంది.." అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు , కొండా సురేఖ , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి , ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ , పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ వేడుక సందర్భంగా ప్రముఖ జ్యోతిష్యులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ఆలయాలకు చెందిన అర్చకులను ముఖ్యమంత్రి సత్కరించారు.



# ప్రతి రైతుకు.. ఒక ఎకరానికి..!

ఈకబురు హైదరాబాద్: యాసంగి సీజన్‌కు గాను 'రైతు భరోసా'కింద పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం విడుదల చేయబోతుంది. ఈ నెల 22న సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి అదే వేదిక నుంచి 'రైతుభరోసా'తొలి విడత నిధులను విడుదల చేయనున్నారు. అయితే ఈసారి గతానికి భిన్నంగా మొదటి విడతలో.. ఎన్ని ఎకరాలున్న రైతుకైనా ఒక ఎకరం లోపు విస్తీర్ణానికే సాయం విడుదల చేయనున్నారు.

గత ప్రభుత్వ హయాంలో 'రైతు బంధు'కింద 2018 జూన్ నుంచి గత వానాకాలం సీజన్‌లో ప్రారంభించిన 'రైతు భరోసా'పథకం వరకు.. దశల వారీగా మొదట ఎకరం విస్తీర్ణం ఉన్న రైతులకు, తర్వాత రెండెకరాలు, అంతకు మించి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందించడం జరిగేది. ఈసారి ఆ విధానాన్ని మార్చి తొలి విడతలో రైతుకు ఎన్ని ఎకరాలు ఉన్నప్పటికీ ఒక ఎకరానికి రూ.6 వేలు మాత్రమే బ్యాంకు ఖాతాలో జమ కానుంది.

తొలివిడతగా 73 లక్షల మందికి రూ.3,590 కోట్లు

గత ఏడాది జూన్ 16వ తేదీన వానాకాలం సీజన్ రైతుభరోసా మొత్తాన్ని ఎకరాకు రూ.6 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. రికార్డు స్థాయిలో 9 రోజుల్లోనే 69.40 లక్షల మంది రైతులకు చెందిన 145.75 లక్షల ఎకరాల విస్తీర్ణానికి రూ.8,744.13 కోట్ల మొత్తాన్ని అందజేసింది. అందులో తొలి విడతగా ఎకరం లోపు భూమి ఉన్న 24.22 లక్షల మంది రైతులకు (13.54 లక్షల ఎకరాల సాగు భూమికి) రూ.812.63 కోట్లు చెల్లించారు. కానీ ఈసారి రైతులందరికీ ఎకరం లోపు విస్తీర్ణానికి సాయం అందించనున్నారు. ఈ విధంగా 73 లక్షల మంది రైతులకు సాయం అందిస్తుండగా.. ఇవ్వాల్సిన మొత్తాన్ని రూ.3,590 కోట్లుగా తేల్చారు. ఇలా చేయడం ద్వారా ప్రతిరైతుకు పెట్టుబడి సాయం అందిందనే తృప్తి లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల భావించినట్లు ఓ అధికారి తెలిపారు. ఇక రెండో విడత కింద రూ. 2,650 కోట్లను ఏప్రిల్‌లో విడుదల చేస్తారు. మూడో విడత కింద మిగతా మొత్తాన్ని ఏప్రిల్ నెలాఖరులోపు విడుదల చేయాలని నిర్ణయించారు.

విస్తీర్ణంలోనూ మార్పులు

రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి 1.50 కోట్ల ఎకరాలకు పైగానే ఉంటుందని వ్యవసాయ శాఖ లెక్కలు కట్టింది. అయితే ఇందులో వానాకాలం సీజన్‌లో పూర్తిస్థాయిలో సాగులో ఉన్న భూమి 1.30 కోట్ల ఎకరాలు. మిగతా భూమిలో మామిడి, నిమ్మ, దానిమ్మ, ఇతర ఉద్యాన తోటలు 12 లక్షల ఎకరాల వరకు ఉంటాయి. మిగతా భూమి సాగులో లేకపోయినా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి సాయం అందింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం సాగు చేసే భూములకు మాత్రమే సీజన్ల వారీగా పెట్టుబడి సాయం ఇస్తామని ప్రకటించింది. కానీ రైతుల్లో వ్యతిరేకత వస్తుందనే కారణంగా పాత పద్ధతినే కొనసాగించింది. గత జూన్‌లో మొత్తం 145.73 లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయం అందజేసింది. ఈసారి 73 లక్షల మంది రైతులకు మొత్తం రూ.8,881 కోట్లు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ లెక్కలు వేసింది. ఈ నేపథ్యంలో ఈసారి రైతుభరోసా కింద రూ.9 వేల కోట్లు విడుదల చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు.

# కార్మిక వర్గానికి వ్యతిరేకం కాదు



కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ కోసం కృషి చెస్తున్నట్లు సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొంది. పరిశ్రమ(ఇండస్ట్రీ) అనే పదానికి విస్తృత అర్థం ఇవ్వడంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తమ తీర్పును రిజర్వ్ చేసింది. పారిశ్రామిక వివాదాల చట్టం-1947లోని ఇండస్ట్రీ అనే పదానికి అర్థం ఏమిటో చెప్పాలని కోరుతూ బెంగళూరు నీటి సరఫరా, మురుగునీటి పారుదల బోర్డు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై 1978 ఫిబ్రవరి 21న అప్పటి ఏడుగురు సభ్యుల ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఆసుపత్రులు, విద్యా సంస్థలు, క్లబ్బులు, ప్రభుత్వ సంక్షేమ విభాగాలను కూడా 'ఇండస్ట్రీ'గా పరిణించాలని వెల్లడించింది. దీంతో ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు పారిశ్రామిక వివాదాల చట్టం-1947 పరిధిలోకి వచ్చారు. తద్వారా వారికి లబ్ధి చేకూరుతోంది.

1978 నాటి తీర్పు సరైనదేనా? అని ప్రశ్నిస్తూ కొందరు వ్యక్తులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యులు రాజ్యాంగ ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. మూడు రోజులుగా విచారణ కొనసాగిస్తోంది. గురువారం కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి హాజరై వాదనలు వినిపించారు. అటవీ శాఖ ఇతర శాఖలను కూడా ఇండస్ట్రీగా ప్రకటించాలని కొందరు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక అంటూ వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. తమ తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ తీర్పు కోసం పారిశ్రామిక వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

# రంగనాథ స్వామి దేవాలయం ప్రత్యేక పూజల్లో..

# మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**ఉగాది పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు తీసుకురావాలి : గంగాధర్ రెడ్డి**





ఈకబురు, శేరిలింగంపల్లి : పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వ దినాన్ని పురస్కరించుకుని గోపన్ పల్లి గ్రామంలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజలు గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి గ్రామంలో గల శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో ఉగాది వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, స్వామివారి ఆభరణాల ఊరేగింపు, వస్త్రాలంకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని రంగనాథ స్వామి అనుగ్రహం పొందారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ, భగవంతుని ఆశీస్సులతో పప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. దశాబ్దాలుగా గోపన్‌పల్లి గ్రామంలో ఉగాది వేడుకలను గ్రామ పెద్దల సమక్షంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని, భవిష్యత్తులో సైతం ఇలాంటి ఆధ్యాత్మిక, సాంప్రదాయ కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదం, దేవుడి కృపతో ప్రజాసేవలో ముందుకు సాగుతున్నానని, రాబోయే రోజుల్లో కూడా ప్రజల మద్దతు కోరుకుంటున్నానని గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, ,బీజేపీ శ్రేణులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రపంచానికి ఇది పరీక్షాసమయం



దేశ ఇంధన అవసరాలు తీరేలా చూసుకోవడానికి సంబంధిత దేశాలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామని తెలిపింది. ఈ మేరకు విదేశాంగశాఖ సహా వివిధ విభాగాల ప్రతినిధులు మీడియా సమావేశంలో వెల్లడించారు. "కువైట్ యువరాజుతో ప్రధాని మోదీ మాట్లాడారు. ఆయా దేశాలు, భాగస్వామ్య పక్షాలతో దౌత్యపరంగాను చర్చలు జరుపుతున్నాం. వీటి ఫలితంగా రెండు ఎల్‌పీజీ నౌకలను హర్మూజ్ జలసంధి మార్గంలో తీసుకురాగలిగాం'' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. మరోవైపు.. చిన్న, మధ్య తరహా, ఇతర వినియోగదారులకు పంపిణీ చేసేందుకుగానూ రాష్ట్రాలకు అధిక పరిమాణంలో బొగ్గును కేటాయించాలని బొగ్గు మంత్రిత్వశాఖ ఇప్పటికే కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.




సౌదీ అరేబియాలో ఎర్రసముద్ర తీరంలో రేవు పట్టణం యన్బులో ఉన్న సమ్రెఫ్ చమురు కేంద్రంపై ఇరాన్ డ్రోన్ దాడికి దిగింది. అరాంకోలో భాగమైన ఆ క్షేత్రంలో భారీగా మంటలు చెలరేగాయి. నష్ట తీవ్రతను అంచనా వేస్తున్నట్టు సౌదీ రక్షణ శాఖ పేర్కొంది. "ఇరాన్ తీరుతో విసిగిపోయాం. మా ఓపికకూ హద్దుంటుంది! పరిస్థితి చేయి దాటితే ఇరాన్‌పై యుద్ధంలోకి మేమూ ప్రవేశించాల్సి వస్తుంది'' అంటూ సౌదీ రాకుమారుడు, విదేశాంగ మంత్రి ఫైసల్‌బిన్ ఫర్హాన్ అల్ సౌద్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "తిరుగులేని ఆయుధ సామర్థ్యం, యుద్ధ సన్నద్ధత సౌదీ, దాని భాగస్వామ్య దేశాల సొంతం.

అవసరమైతే వాటిని ఇరాన్‌పై ప్రయోగించేందుకు ఏమాత్రమూ వెనకడబోమని గుర్తుంచుకుంటే మంచిది'' అని హితవు పలికారు. ఇరాన్ డ్రోన్లు కువైట్‌లో కూడా అల్ అహ్మదీ, మైనా అబ్దుల్లా చమురు క్షేత్రాలకు, యూఏఈ, అబుదాబిల్లోనూ పలు సహజవాయు కేంద్రాలకు నష్టం కలిగించాయి. తమ ఇంధన వ్యవస్థలపై దాడులకు దిగి ఇజ్రాయెల్ దిద్దుకోలేనంత పెద్ద తప్పు చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. "నిజానికి పొరుగు దేశాల ఇంధన క్షేత్రాలపై దాడులు చేసే యోచనే మాకు లేదు. కానీ మా ఇంధన వ్యవస్థలపై ఇజ్రాయెల్, అమెరికా దాడులతో యుద్ధం మరో స్థాయికి చేరింది.

అందుకే గల్ఫ్ దేశాల ఇంధన వ్యవస్థలపై మేమూ దాడులకు దిగాం. మా ఇంధన వ్యవస్థలపై మరోసారి దాడులు జరిగితే గల్ఫ్ దేశాల్లోని సదరు వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసి తీరతాం'' అంటూ హెచ్చరించింది! రస్ లఫాన్‌పై దాడుల పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దానిపై మళ్లీ దాడికి దిగితే కనీవినీ ఎరగని స్థాయి దాడులతో సౌత్ పార్స్ సహజవాయు క్షేత్రాన్ని పూర్తిగా బుగ్గిపాలు చేసేస్తామని ఇరాన్‌ను తీవ్రంగా హెచ్చరించారు. సౌత్ పార్స్‌పై ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేయబోదని అధ్యక్షుడు హామీ ఇచ్చారు.

గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను ఖండిస్తూ 12 అరబ్, ఇస్లామిక్ దేశాలు ఒక ప్రకటన విడుదల చేశాయి. "దాడులను ఇరాన్ తక్షణం మానుకోవాలి. లేదంటే స్వీయరక్షణ చేసుకునే హక్కు గల్ఫ్ దేశాలకు ఉంటుంది'' అని హెచ్చరించాయి. నౌకలు, ఇంధన వ్యవస్థలపై ఇరాన్ దాడులను జపాన్‌తో పాటు పలు యూరప్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. రస్ లఫాన్‌పై దాడికి నిరసనగా ఇరాన్ దౌత్య కార్యాలయంలోని అధికారులంతా 24 గంటల్లోపు దేశం వీడాలని ఖతర్ ఆదేశించింది. తాజా పరిణామాలో చమురు ధరలు మరింతగా భగ్గుమన్నాయి. గురువారం బ్యారెల్ ధర 119 డాలర్ల దాకా ఎగబాకింది!

**ఇరాన్ జలాంతర్గాములు ఖతం!**

ఇరాన్ జలాంతర్గాములన్నింటినీ ధ్వంసం చేసినట్టు అమెరికా ప్రకటించింది. ఆ దేశం వద్ద ఉన్న 11 జలాంతర్గాములనూ బుగ్గిపాలు చేసినట్టు రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. ఇరాన్ పౌర, సైనిక నేతలందరినీ లక్ష్యం చేసుకున్నట్టు స్పష్టం చేశారు. హార్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ పడవలపై అమెరికా యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించినట్టు అమెరికా ప్రకటించింది.

ఇరాన్ భూగర్భ ఆయుధ నిల్వ కేంద్రాలపై 5,000 పౌండ్ల బరువైన భారీ బాంబులు వేసినట్టు జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డాన్ కెయిన్ వెల్లడించారు. మరోవైపు, కాస్పియన్ సముద్రంలో పలు ఇరాన్ లక్ష్యాలపై తొలిసారి దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. ఒక నౌకాశ్రయం, పలు నౌకలు, కమాండ్ సెంటర్‌పై క్షిపణుల వర్షం కురిపించినట్టు వెల్లడించింది. అంతేగాక టెహ్రాన్‌తో సహా ఇరాన్‌వ్యాప్తంగా ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల పరంపర గురువారం కూడా తీవ్రస్థాయిలో కొనసాగింది. కొన్ని వందల లక్ష్యాలను క్షిపణులు, బాంబులతో ధ్వంసం చేసినట్టు ఇరు దేశాలు ప్రకటించాఇయి. ఇజ్రాయెల్‌పై కూడా ఇరాన్ గురువారం ఎడాపెడా దాడులకు దిగింది. దాంతో జెరూసలేం, టెల్ అవీవ్‌తో పాటు పలు నగరాల్లో జనం భారీ సంఖ్యలో బంకర్లకేసి పరుగులు తీశారు. చాలా చోట్ల భవనాలు భారీగా దెబ్బ తిన్నాయి. ఉత్తర ఇజ్రాయెల్‌లో కీలకమైన విద్యుత్ గ్రిడ్ బాగా క్షిపణి దాడుల్లో దెబ్బ తిన్నట్టు ఇంధన మంత్రి ఎలీ కోహెన్ చెప్పారు. హైఫియా నగరంలో చమురు రిఫైనరీకి కూడా దాడుల్లో నష్టం జరిగింది. అక్కడి నుంచి భారీగా పొగ వెలువడుతున్న దృశ్యాలను ఇజ్రాయెల్ మీడియా ప్రసారం చేసింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. తమ దేశంలో ఇప్పటిదాకా మృతుల సంఖ్య 1,000, నిర్వాసితుల సంఖ్య 10 లక్షలు దాటినట్టు ఆరోగ్య శాఖ తాజాగా వెల్లడించింది. లెబనాన్‌లో 500 మందికి పైగా హెజ్బొల్లా ఉగ్రవాదులను మట్టుపెట్టినట్టు ఇజ్రాయెల్ పేర్కొంది.

**పొంచి ఉన్న ఇంటర్నెట్ సంక్షోభం**

సముద్ర ఇంటర్నెట్ కేబుళ్లను ఇరాన్ కత్తిరిస్తుందా?

ఇప్పటికే పశ్చిమాసియాలో అమెరికా మిత్రదేశాలపై మిస్సైళ్లతో దాడిచేస్తున్న ఇరాన్ ఇకపై హార్మూజ్ జలసంధి గుండా వెళ్తున్న సముద్రగర్భ ఇంటర్నెట్ భారీ కేబుళ్లను కత్తిరిస్తుందా? అనే ప్రశ్న ఇప్పుడు ఆయా కేబుళ్లపై ఆధారపడిన దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. నిజంగానే ఇరాన్ కేబుళ్ల కత్తిరింపు పర్వానికి తెరలేపితే మళ్లీ కేబుళ్ల పునరుద్ధరణకు వారాలు లేదా నెలల సమయం పడుతుందని అంతర్జాతీయ కేబుల్ నెట్‌వర్క్ నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ డిజిటల్ గుండెకు ఈ సముద్రకేబుళ్లను కవాటాలుగా చెప్పొచ్చు.

పలు దేశాల బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలు, మెయిళ్లు, కృత్రిమమేధ సేవలు, వీడియో కాల్స్‌కు సంబంధించిన డేటా మొత్తం ఈ కేబుళ్ల ద్వారానే బదిలీ అవుతోంది. యూరప్, ఆసియా, ఆఫ్రికా దేశాల మధ్య ఇంటర్నెట్ వారధులుగా ఈ సముద్ర కేబుళ్లు ఖ్యాతిగాంచాయి. హార్మూజ్, ఎర్ర సముద్రం గుండా దాదాపు 17 భారీ ఇంటర్నెట్ కేబుళ్లు వెళ్తున్నాయి. ఏఏఈ-1, ఫాల్కన్, 'గల్ఫ్ బ్రిడ్జ్ ఇంటర్నేషనల్ కేబుల్ సిస్టమ్', 'టాటా-టీజీఎన్ గల్ఫ్ కేబుల్'వంటి పలు కేబుళ్లు పర్షియన్ గల్ఫ్ జలాల గుండా వెళ్తున్నాయి. ఇవన్నీ భారత విదేశీ డేటా కనెక్షన్లకు కీలకం. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాల్లో పెద్ద డేటా సెంటర్లను నెలకొల్పేందుకు అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ సంస్థలు వేలకోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నాయి.

ఇక్కడి డేటా సెంటర్లను విదేశాల్లోని వినియోగదారులు, మార్కెట్లతో అనుసంధానించి గల్ఫ్‌దేశాలను భవిష్యత్‌లో ఏఐ కేంద్రాలుగా మార్చాలని ఆశిస్తున్నాయి. వీటికి ఇవే కేబుళ్లు ప్రాణాధారం. ఇప్పుడు ఈ కేబుళ్లను ఇరాన్ సముద్ర మందుపాతరలతో నాశనంచేస్తే వెంటనే పునరుద్ధరించడం కష్టం. కొత్త కేబుళ్లు అమర్చేందుకు ప్రత్యేక నౌకలు పర్షియన్ గల్ఫ్ జలాల్లో అడుగుపెట్టాల్సి ఉంటుంది. ఇప్పుడున్న ఉద్రిక్త పరిస్థితుల్లో అవి రావడం దాదాపు అసాధ్యం. దీంతో పునరుద్ధరణ పనులు ఆగిపోయి వారాలు లేదా నెలల తరబడి ఈ మార్గంలో డిజిటల్ లావాదేవీలు, డేటా బదిలీ ఆగిపోయే ప్రమాదముందని కేబుల్ సేవాలరంగ సంస్థ 'టెలీజియోగ్రఫీ'లో నిపుణుడు అలాన్ మౌల్డిన్ చెప్పారు.

**ఇరాన్‌పై యుద్ధం కోసం... రూ.18.5 లక్షల కోట్లు పెంటగాన్ అభ్యర్థన**

వాషింగ్టన్: ఇరాన్‌పై యుద్ధం నిమిత్తం ఏకంగా మరో రూ.18.5 లక్షల కోట్ల (200 బిలియన్ డాలర్ల) అదనపు నిధులు కావాలని అమెరికా అంచనా వేసింది! వాటిని విడుదల చేయాల్సిందిగా కాంగ్రెస్‌ను పెంటగాన్ అభ్యర్థించింది. ఈ మేరకు వైట్‌హౌస్‌కు ఇప్పటికే లేఖ పంపినట్టు వాషింగ్టన్ పోస్ట్ వార్తా సంస్థ నివేదించింది. దీనిపై మీడియా ప్రశ్నలకు రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ నేరుగా బదులివ్వలేదు. దుష్ట నిర్మూలనకు నిధులు కావాల్సిందేనంటూ సరిపెట్టారు. ఇంత భారీ నిధులకు కాంగ్రెస్ ఆమోదం అనుమానమే. దీనిపై ట్రంప్ సర్కారుకు చట్టసభ నుంచి పలు ప్రశ్నలు ఎదురవడం ఖాయమని భావిస్తున్నారు.

**యూఏఈ నుంచి 'యాపిల్' ఔట్?**

పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా దిగ్గజ సంస్థ యాపిల్ తన ఐఫోన్ల నిల్వ కేంద్రాన్ని యూఏఈ నుంచి తరలిస్తోంది. యాపిల్‌కు భారత్‌లో భారీ ఐఫోన్ తయారీ కేంద్రమున్న విషయం తెలిసిందే. వాటిని అమెరికాకు రవాణా చేసే క్రమంలో దుబాయ్ అతి పెద్ద నిల్వ కేంద్రంగా ఉపయోగపడుతోంది.

**గల్ఫ్‌కు భారత యుద్ధనౌకలు**

హార్మూజ్‌ను దాటేందుకు ఎదురుచూస్తున్న తన నౌకల రక్షణ నిమిత్తం భారత్ మరిన్ని యుద్ధ నౌకలను గల్ఫ్ తీరానికి తరలిస్తోంది. నావికా దళం ఇప్పటికే ఆరుకు పైగా యుద్ధ నౌకలను మోహరించినట్టు తెలుస్తోంది. హార్మూజ్ వద్ద 22 భారత నౌకలు చిక్కుబడి ఉండటం తెలిసిందే. వీటిలో సగానికి పైగా చమురు, ఎల్పీజీ నిల్వలతో కూడినవే.

**అమెరికా విమానం కూల్చివేత!**

ఇరాన్ గురువా రం అమెరికా ఎఫ్-35 యుద్ధ విమానాన్ని కూల్చేసినట్టు తెలుస్తోంది! ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైనప్పటి నుంచీ అగ్ర రాజ్య ఫైటర్ జెట్‌ను ఇరాన్ కూల్చడం ఇదే తొలిసారి కావడం విశేషం. మరోవైపు, ఇరాన్‌పై అణ్వస్త్ర దాడికి అమెరికా యోచన చేస్తోందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## నా పోరాటం ముగ్గురిపైనే: కవిత



ఈకబురు హైదరాబాద్: : "నేను ఎవరితోనూ రాజీపడను.. ఆ అవసరం కూడా నాకు లేదు. నా పోరాటమంతా డాడీ (కేసీఆర్), మోడీ (ప్రధాని), చిన్నమోడీ (సీఎం రేవంత్‌రెడ్డి) పైనే'' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో గురువారం ఆమె మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. తాను బీఆర్ఎస్‌కు దూరమైన తర్వాత నిజామాబాద్ జిల్లాలో ఆ పార్టీ పూర్తిగా నష్టపోయిందన్నారు. ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో జాగృతి పార్టీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ అని కాదు.. చాలాచోట్ల నుంచి తనను ఎన్నికల్లో పోటీ చేయమంటున్నారని, ఇటీవల వనపర్తి నుంచి పోటీ చేయాలని జాగృతి కార్యకర్తలు కోరుతున్నారని తెలిపారు. అయితే, ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలనే విషయాన్ని సమయానుగుణంగా నిర్ణయించుకుంటానని చెప్పారు. బీఆర్ఎస్‌తో తనకున్న విభేదాలను సీఎం రేవంత్‌రెడ్డి అవకాశంగా తీసుకుంటున్నార ని ఆరోపించారు. తనకు ఎటువంటి బేషజాలు లేవని, అందరినీ కలుపుకొనిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో విశారదన్, ప్రజా సంఘాలు, సీపీఎం, సీపీఐఎం ఎల్ న్యూడెమొక్రసీ పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని వెల్లడించారు. సామాజిక తెలంగాణ ధ్యేయంతో.. సర్వోదయ రాష్ట్రం దిశగా ముందుకు వెళ్తున్నామని, ఇందుకోసం గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాన్నిఅధ్యయనం చేస్తున్నానని చెప్పారు. మంచి ముహూర్తం చూసుకొని తన కొత్త పార్టీని త్వరలోనే ప్రకటిస్తానని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన యువతకు రాజకీయంగా అవకాశం కల్పిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ప్రభావం కచ్చితంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే పార్టీ ప్రకటనకు ముందే... శ్రీరామనవమి తర్వాత పలువురు జాతీయ స్థాయి నేతలను కలవనున్నానని కవిత తెలిపారు. కాగా, తెలంగాణ ప్రజా జాగృతి పేరిట కవిత కొత్త పార్టీని త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

**2,15,200 కోట్లతో జాగృతి ప్రజా బడ్జెట్**

రాష్ట్ర ప్రభుత్వం నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జాగృతి ప్రజా బడ్జెట్ పేరిట ఆ సంస్థ అధ్యక్షురాలు కవిత రూ.2,15,200కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ప్రభుత్వం 3లక్షల కోట్లకు పైగా అంచనాలతో బడ్జెట్ ప్రవేశపెట్టనుందని, తాము 2.15లక్షల కోట్లతోనే బడ్జెట్ ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. ప్రజల సూచనల మేరకే ప్రజా బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ప్రజా బడ్జెట్‌లో విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్ద పీట వేశామని, కాగా సంక్షేమ పథకాలను గాంధీ కుటుంబ సభ్యులే కాదు తమకు నచ్చిన వారి పేర్లతో ప్రకటించుకోవచ్చన్నవారు. తాము ప్రతిపాదించిన బడ్జెట్ వల్ల రాష్ట్ర పురోగతితో పాటు సంపద సృష్టి కూడా జరుగుతుందని కవిత పేర్కొన్నారు.

## కూటమి ప్రభుత్వ సంకల్పం సిద్ధిస్తుంది



ఈ కబురు, అమరావతి :

స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక ప్రణాళికలతో ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి పథాన నిలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2047 నాటికి తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకున్నామని ఆయన వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఉగాది పచ్చడి ప్రసాదాన్ని సేవించిన అనంతరం మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాంగ శ్రవణం చేశారు. బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ పంచాంగ పఠనం చేశారు. అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియచేశారు. ఉగాది పచ్చడి మన జీవితాలను ప్రతిబింబిస్తుందని.. షడ్రుచుల తరహాలోనే జీవితంలో కష్ట సుఖాలు ఉంటాయని ముఖ్యమంత్రి అన్నారు. పండుగలు ఆరోగ్య కరమైన జీవనశైలిని నేర్పుతాయన్నారు. పండుగలు, ఆచారాల్లోనే సైన్సు ఉందని...వాస్తు లాంటి శాస్త్రాలు, సూర్య నమస్కారం లాంటి ఆచారాలు ఇలాంటి వేనని సీఎం అన్నారు. యోగా, నేచురోపతి లాంటి వైద్యం కూడా ప్రకృతి నుంచి వచ్చిందేనని...ఆరోగ్యం, ఆనందం, సంపద వీటి వల్లే సాధ్యం అవుతుందన్నారు. నేలను, ప్రకృతిని, నీటిని ఆరాధిస్తామని.. దానిని అందిపుచ్చుకుని నీటిని పరిరక్షించేలా నీటి భద్రత విధానాన్ని తీసుకువచ్చామన్నారు. తాగునీటికి, సాగునీటికి, పరిశ్రమలకు అవసరమైన నీటిని సరఫరా చేసేలా నీటి యాజమాన్యం చేస్తున్నట్టు వివరించారు. ప్రస్తుతం వేసవి వచ్చినా రాష్ట్రంలోని రిజర్వాయర్లలో 65 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. అందుకే మే 15 నాటికే నారుమళ్లు వేసుకోవాలని ముందుగానే ప్రకటించిన ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యమంత్రిగా మూడో మారు గోదావరి పుష్కరాలను నిర్వహించే గౌరవం తనకు దక్కిందని .. ఆ తదుపరి కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఇప్పటి వరకూ రూ.1943 కోట్ల రూపాయలు ఇచ్చామని..గత పాలకులు పైసా కూడా వారికి ఇవ్వలేదన్నారు. అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం కావాలంటే పోలవరం పూర్తి కావాలని..గోదావరి పుష్కరాలకంటే ముందు ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. కృష్ణా డెల్టాకు, విశాఖకు గ్రావిటీతో నీళ్లు వెళ్తే..రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఇంకా రూ.5 వేల కోట్ల మేర నిధులు వ్యయం చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు అందిస్తున్న కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. సమీప భవిష్యత్తులో పూర్తిస్థాయి సాంకేతికతతో పాలన జరిగే అవకాశం ఉంటుందని, వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు ఇలా వేర్వేరు పరిస్థితులు అప్పటికప్పుడు అధ్యయనం చేసి దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వచ్చేసిందన్నారు. 30 ఏళ్ల క్రితమే తాను ఐటీ విప్లవాన్ని ఊహించి టెక్నాలజీని ప్రోత్సహించానని తద్వారా చాలా మంది జీవితాల్లో మార్పు వచ్చిందని అన్నారు. నాడు తీసుకున్న నిర్ణయంతోనే హైదరాబాద్ ఇప్పుడు నాలెడ్జి ఎకానమీగా ఎదిగిందన్నారు. ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ, డేటా సెంటర్ల గురించి చర్చిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు నేర్పే విలువలను గౌరవించాలని.. ఇక్కడ ఉండే మనకంటే విదేశాల్లోని ప్రవాస తెలుగు వారు వాటికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారన్నారు. తెలుగు జాతిని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టటమే తన సంకల్పమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంజీవని ప్రాజెక్టు ద్వారా ముఖ్యమైన ముందడుగు వేశామన్నారు. 2024 కంటే ముందు ఎవరూ సంతోషంగా పండుగలు జరుపుకునే పరిస్థితి లేదని.. ఒక వ్యక్తి కారణంగా ఎక్కడ చూసినా భయం, విధ్వంసం, దారుణాలు జరిగాయని ఆక్షేపించారు. మన దేశంలో ఉమ్మడిగా అంతా కలిసి ఉండే సంప్రదాయం ఉందని.. కొందరు స్వార్థంతో తల్లికి, చెల్లెలికి ఆస్తులు ఇవ్వని వ్యక్తులు కూడా ఉన్నారని సీఎం అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గా ఏర్పడి సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి ఆర్థిక, సామాజిక, ఆరోగ్య భద్రత అందించాలన్నది లక్ష్యమని తెలిపారు. పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీతో మళ్లీ మన జనాభా పెంచేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే తల్లికి వందనం ద్వారా ఎంతమంది ఉన్నా ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు వివరించారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులను, స్త్రీశక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకూ 56 కోట్ల ప్రయాణాలు జరిగాయన్నారు. దివ్యాంగశక్తి ద్వారా దివ్యాంగులకు ఉచిత ప్రయాణంతో ఆత్మగౌరవాన్ని కల్పించటంతో పాటు డబ్బులు ఆదా అయ్యేలా చేస్తున్నామని వివరించారు. అర్చకులకు రూ.15 వేల వేతనం ఇవ్వటంతో పాటు ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. సమాజంలో అట్టడుగున ఉండిపోయిన వారిని పేదరికం నుంచి బయటపడేసేలా జీరో పావర్టీ కార్యక్రమం పీ4 చేపట్టామని అన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా దీనిని అమలు చేస్తున్నట్టు వివరించారు. సమాజంలో సంపన్నులైన 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మందిని ఆదుకునేలా పీ4 చేపట్టామని తెలిపారు. తాను పనిచేసేది 5 కోట్ల మంది రాష్ట్రప్రజల కోసమని.. అందరి జీవన ప్రమాణాలు మెరుగుపర్చటం కోసమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్టరంలో సమగ్ర అభివృద్ధి కోసం విశాఖ, తిరుపతి, అమరావతి కేంద్రాలుగా ప్రాంతీయ ఎకనామిక్ కారిడార్లు తీసుకువచ్చామని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు, రైల్వేలైన్లు అనుసంధానం చేసి లాజిస్టిక్స్ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు వివరించారు. ప్రజా రాజధాని అమరావతి అద్భుతంగా అభివృద్ధి సాధించేలా ప్రణాళికలు చేశామని ముఖ్యమంత్రి తెలియచేశారు. తాను అందరివాడిగా ఉండాలని కోరుకుంటున్నానని కొందరు దుష్టులు ఏమార్చే కుట్రలు చేస్తారని వారి నుంచి అప్రమత్తంగా ఉండాలని సీఎం అన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు హామీ ఇచ్చినట్టుగానే 20 లక్షల ఉద్యోగాల కల్పనకు సంకల్పం చేశామన్నారు.

## బడ్జెట్ సెగ్మెంట్‌లో రియల్..
# మీ నుంచి పీ4 లైట్.. ఫీచర్లు ఇవే

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ రియల్‌మీ.. పీ4 లైట్ పేరిట బడ్జెట్ ధరలో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొచ్చింది. ఇప్పటికే పీ4 సిరీస్‌లో పీ4, పీ4ఎక్స్, పీ4 ప్రో 5జీ మోడళ్లను కంపెనీ లాంచ్ చేసింది. తాజాగా బడ్జెట్ సెగ్మెంట్‌లో పీ4 లైట్‌ను తీసుకొచ్చింది. డైమెన్సిటీ 6300 5జీ చిప్‌సెట్, ఎయిర్‌ఫ్లో వేపర్ ఛాంబర్ హీట్ తొలగించే వ్యవస్థతో పాటు 7000 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీ ఈ ఫోన్ ప్రధాన ఫీచర్లు. పూర్తి వివరాల్లోకి వెళితే..

పీ4 లైట్ ప్రత్యేకతలు
6.8 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ స్క్రీన్
144 Hz రిఫ్రెష్ రేట్, 900 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్
ఆండ్రాయిడ్ 16 ఆధారిత రియల్‌మీయూఐ 7.0
రెండేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, మూడేళ్లపాటు సెక్యూరిటీ అప్‌డేట్స్
మీడియాటెక్ 6300 5జీ ప్రాసెసర్
13 ఎంపీ ప్రధాన కెమెరా, 5 ఎంపీ సెల్ఫీ కెమెరా
7000 ఎంఏహెచ్ బ్యాటరీ, 15W ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్




బరువు 212 గ్రాములు
ధర ఎంత?: 4జీబీ+ 64జీబీ ధర రూ.12,999; 4జీబీ+ 128జీబీ ధర రూ.13,999; 6జీబీ+ 128జీబీ వేరియంట్ ధర రూ.15,999గా కంపెనీ నిర్ణయించింది. మొసాయిక్ బ్లూ, మొసాయిక్ గ్రీన్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, రియల్‌మీ ఇండియా వెబ్‌సైట్, ఇతర ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో మార్చి 25 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. లాంచ్ ఆఫర్‌లో భాగంగా రూ.1000 డిస్కౌంట్ లభిస్తుంది. బ్యాంక్ ఆఫర్ కింద రూ.500, రియల్‌మీ కస్టమర్లకు రూ.500 అదనపు ఎక్స్చేంజ్ బోనస్ లభిస్తుంది.

# ఏఐలో భారత్‌కి ప్రత్యేక స్థానం
## కాగ్నిజెంట్ చీఫ్ ఏఐ ఆఫీసర్

న్యూఢిల్లీ: కృత్రిమ మేథ (ఏఐ) వినియోగంలో భారత్‌కి విశిష్ట స్థానం ఉందని టెక్ దిగ్గజం కాగ్నిజెంట్ చీఫ్ ఏఐ ఆఫీసర్ బాబక్ హోడ్జాత్ తెలిపారు. డిజిటల్ సిస్టమ్‌లు, ప్రక్రియల గురించి అపార అవగాహన ఉన్న ప్రతిభావంతులు పెద్ద సంఖ్యలో ఉండటం ఇందుకు దోహదపడుతోందని పేర్కొన్నారు.ఏఐ సిస్టమ్‌లను రూపొందించడంలో, వివిధ పరిశ్రమలవ్యాప్తంగా వినియోగాన్ని వేగవంతం చేయడంలో ఈ నిపుణులు కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. ఏఐ సాధనాలతో కోడింగ్ సులభతరమవుతున్నప్పటికీ, ఔట్‌పుట్ నాణ్యతను మదింపు చేయడానికి డెవలపర్లు ఇప్పటికీ అవసరమేనని ఆయన చెప్పారు. వివిధ రంగాలవ్యాప్తంగా మరింత మంది ప్రొఫెషనల్స్‌కి ఏఐ సాధికారత కల్పిస్తోందని వివరించారు. కంపెనీలు కృత్రిమ మేథ టెక్నాలజీలను వినియోగించుకోవడంలో సహకరించే దిశగా కాగ్నిజెంట్ ఇప్పుడు ఏఐ బిల్డర్ కంపెనీగా రూపాంతరం చెందిందని బాబక్ చెప్పారు. ఉద్యోగులకు కొత్త నైపుణ్యాల్లో శిక్షణనివ్వడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు వివరించారు. కంపెనీలో అంతర్గతంగా కోడ్ జనరేషన్‌లో ఏఐ వాటా సుమారు 30 శాతంగా ఉండగా, ఇది గణనీయంగా పెరుగుతోందని పేర్కొన్నారు.

# మార్కెట్‌కు చమురు మంటలు..
# సెన్సెక్స్ 2497 పాయింట్లు పతనం



### కారణాలు ఇవీ..

చమురు ధరలు: ఖతార్‌లోని అత్యంత కీలకమైన రస్ లాఫాన్ ఇండస్ట్రియల్ సిటీపై ఇరాన్ క్షిపణితో దాడి చేసింది. ఇది ఖతార్ ఆర్థికవ్యవస్థకు పునాది. ఈ దాడి ఉద్రిక్తతలను మరింత పెంచనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రస్ లాఫాన్ గ్యాస్ క్షేత్రం నుంచి అత్యధికంగా ఫెర్టిలైజర్స్, సీఎన్‌జీ, పీఎన్‌జీ అవసరాల కోసం భారత్ ఆధారపడుతుంది. భారత్ కొనుగోలు చేసే లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌లో 47శాతం ఖతార్ నుంచే లభిస్తుంది. సౌదీ ఆరామ్‌కో రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడులకు దిగింది. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ 115 డాలర్ల మార్కును చేరింది.

ముంబయి: పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రతరం అవుతోంది. తమ దేశంలోని గ్యాస్ క్షేత్రంపై దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా పొరుగుదేశాల్లో దాడులకు తెగబడుతోంది. ఖతార్, సౌదీలోని ఇంధన మౌలిక వసతులే లక్ష్యంగా దాడులు చేస్తోంది. దీంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 115 డాలర్ల స్థాయికి చేరింది. ఈ మంటలు దలాల్ స్ట్రీట్‌నూ తాకాయి. దీనికి తోడు వడ్డీ రేట్లను స్థిరంగా కొనసాగిస్తున్నట్లు అమెరికా ప్రకటించడమూ ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో మూడు రోజుల పాటు వరుస లాభాలు చవిచూసిన స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ ఓ దశలో 2700 పాయింట్ల మేర క్షీణించగా.. నిఫ్టీ 23వేల దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.13 లక్షల కోట్లు క్షీణించి రూ.426 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 74,750.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,704.13) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 73,950.95 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 2496.89 పాయింట్ల నష్టంతో 74,207.24 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 775.65 పాయింట్ల నష్టంతో 23,002.15 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 114 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4700 డాలర్ల స్థాయికి చేరింది.

ఫెడ్ నిర్ణయం: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను సవరించలేదు. ద్రవ్యోల్బణం ఊహించిన స్థాయిలో దిగువకు రాలేదని, అందుకే వడ్డీ రేట్లను స్థిరంగా కొనసాగిస్తున్నట్లు ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్ పేర్కొన్నారు. దీంతో నిన్నటి అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఈ ప్రభావం ఆసియా సహా మన మార్కెట్లపైనా పడింది. దీనికితోడు అమెరికా బాండ్ రాబడులు మళ్లీ పెరగడం ఈక్విటీ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. హెచ్‌డీఎఫ్‌సీ

షేర్ల పతనం: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాత్కాలిక ఛైర్మన్ అతాను చక్రవర్తి రాజీనామాతో ఆ బ్యాంక్ షేర్లు 9 శాతం మేర పతనమయ్యాయి. అధిక వెయిటేజీ కలిగిన స్టాక్ కావడంతో సూచీలపై ఆ ప్రభావం కనిపించింది. ఎఫ్ఐఐల విక్రయాలు: దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా రూ.2714 కోట్ల విలువైన షేర్లను వీరు విక్రయించారు. గడిచిన 14 రోజులుగా నెట్ సెలర్లుగా నిలుస్తుండడం మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. లాభాల స్వీకరణ: గత మూడు ట్రేడింగ్ సెషన్లలో బెంచ్ మార్క్ సూచీలు లాభాలు చవిచూశాయి. అంతర్జాతీయంగా మరోసారి నెగిటివ్ వార్తల నేపథ్యంలో మదుపర్లు కొంత లాభాలకు స్వీకరణకు దిగడంతో మార్కెట్‌పై ఆ ప్రభావం కనిపించింది.

### ఇన్‌స్టా రీల్స్‌లో ఆ కష్టాలకు చెక్.. ఇక ఒక్క ట్యాప్‌తో పాజ్

యూట్యూబ్‌లోనో, ఏదైనా ఇతర వీడియో ప్లాట్‌ఫామ్‌లోనో వీడియో చూసేటప్పుడు మధ్యలో ఆపాల్సి వస్తే ఏం చేస్తాం? సింపుల్‌గా ట్యాప్ చేసి.. మళ్లీ తిరిగి ప్రారంభించాల్సినప్పుడు మరోసారి ట్యాప్ చేస్తాం. కానీ, ఇన్‌స్టాలో అలా కాదు. రీల్స్ చూస్తున్నప్పుడు మధ్యలో ఆపాలంటే దాన్ని హోల్డ్ చేయాల్సి ఉంటుంది. ఇతర ప్లాట్‌ఫామ్‌ల మాదిరిగా ట్రై చేస్తే మ్యూట్ ఆప్షన్ పనిచేస్తుంది. ఇతర ప్లాట్‌ఫామ్‌లు వాడుతూ ఇన్‌స్టా దగ్గరకొచ్చేసరికి కొందరికి ఈ సమస్య ఎదురవుతుంటుంది. దీన్ని గుర్తించిన మెటా.. ట్యాప్-టు- పాజ్ ఆప్షన్‌ను తీసుకొచ్చింది.

అంటే ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో వీడియోను ఆపడానికి ఇకపై స్క్రీన్‌పై వేలితో నొక్కి పట్టుకోవాల్సిన అవసరం లేదన్నమాట. ఇతర వీడియో ప్లాట్‌ఫారమ్స్ మాదిరిగానే ఒక్క ట్యాప్‌తో రీల్‌ను ఆపొచ్చు. వీడియో పాజ్ చేసినప్పుడు స్క్రీన్‌పై మీకు మ్యూట్ ఆప్షన్ కూడా కనిపిస్తుంది. దీనిద్వారా మీరు ఆడియోను కంట్రోల్ చేయొచ్చు. వీడియోలో ఏదైనా క్యాప్షన్ చదవడానికి లేదా ఏదైనా ఒక సీన్‌ను నిశితంగా చూడ్డానికి ట్యాప్ ఆప్షన్ ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఈ అప్‌డేట్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులందరికీ దశలవారీగా అందుబాటులోకి రానుంది.

# జియో ప్లాన్
## ..ఒక్కసారి రీచార్జ్‌తో బోలెడు బెనిఫిట్లు




పదే పదే రీఛార్జ్ చేయించుకునే తలనొప్పి లేకుండా, ఒక్కసారి రీఛార్జ్‌తో ఏడాది మొత్తం ప్రశాంతంగా గడపాలనుకునే వారి కోసం రిలయన్స్ జియోలో ఒక అద్భుతమైన ప్లాన్ అందుబాటులో ఉంది. రూ. 3,599 ధరతో కూడిన ఈ ప్లాన్ కేవలం డేటా, కాలింగ్ మాత్రమే కాకుండా, ఏకంగా రూ. 35,000 పైగా విలువైన ప్రీమియం ప్రయోజనాలను అందిస్తుండటం విశేషం.

జియో రూ. 3,599 ప్లాన్ పూర్తి వివరాలు
ఈ ప్లాన్ ద్వారా లభించే ప్రధాన ప్రయోజనాలు ఇవే.. 365 రోజులు (పూర్తిగా ఒక సంవత్సరం) వాలిడిటీ ఉంటుంది. ప్రతిరోజూ 2.5 GB హైస్పీడ్ డేటా లభిస్తుంది. దేశంలోని ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత ఉచిత కాలింగ్ చేసుకోవచ్చు. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు ఉచితం. అర్హత ఉన్న వినియోగదారులకు అపరిమిత 5G డేటా పొందే అవకాశం ఉంటుంది. సాధారణ బెనిఫిట్స్‌తో పాటు, ఈ ప్లాన్ ద్వారా లభించే ఎక్స్‌ట్రా ఫీచర్లు యూజర్లను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. క్రికెట్ మ్యాచ్‌లు, లేటెస్ట్ సినిమాలు చూడాలనుకునే వారి కోసం కంపెనీ 3 నెలల డిస్నీ+ హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా అందిస్తోంది. అలాగే ఈ ప్లాన్‌లోని అత్యంత ఆకర్షణీయమైన అంశం రూ. 35,100 విలువైన గూగుల్ జెమిని ప్రో (Google Gemini Pro) సబ్‌స్క్రిప్షన్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రియుల కోసం భారీ విలువ కలిగిన గూగుల్ జెమిని ప్రో సబ్‌స్క్రిప్షన్‌ను జియో ఆఫర్ చేస్తోంది. ఫోన్ మెమరీ సమస్యను అధిగమించేందుకు 50 GB ఉచిత క్లౌడ్ స్టోరేజ్ సౌకర్యాన్ని కూడా జియో కల్పిస్తోంది.

## హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ అనూహ్య రాజీనామా..
## 9 శాతం కుంగిన షేర్లు




హెచ్‌డీఎఫ్‌సీ పార్ట్ టైం ఛైర్మన్, స్వతంత్ర డైరెక్టర్ అయిన అతాను చక్రబర్తి అనూహ్య రాజీనామాతో ఆ బ్యాంక్ (HDFC Bank) షేర్లు భారీగా కుంగాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో 9 శాతం మేర పతనమయ్యాయి. బ్యాంక్ నిఫ్టీ 3 శాతం మేర పడిపోయింది. బ్యాంకులో గత రెండేళ్లలో జరిగిన కొన్ని సంఘటనలు, ధోరణులను అంగీకరించలేకపోతున్నానని అతాను వెల్లడించడం ప్రభావం చూపిస్తోంది. ''ఆయన నిర్దిష్ట కారణం మాత్రం వెల్లడించలేదు. విశ్వసనీయమైన చర్యలు తీసుకునేవరకు ఇప్పుడు ఏర్పడిన అభిప్రాయమే ప్రభావం చూపిస్తుంది'' అని జేపీమోర్గాన్ విశ్లేషకులు అనుజ్ సింగ్లా పేర్కొన్నారు. తాజా పరిణామాలతో దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు బ్యాంకులో మదుపర్ల సంపద లక్ష కోట్లకు పైగా తుడిచిపెట్టుకుపోయింది.

పెద్ద సమస్యలేవీ లేవు.. కేకీ మిస్త్రీ
చక్రబర్తి రాజీనామా తక్షణం అమల్లోకి రావడంతో కేకీ మిస్త్రీని మధ్యంతర పార్ట్ టైం ఛైర్మన్‌గా బ్యాంకు నియమించింది. ''ఈ రాజీనామా వెనక బ్యాంక్‌లో ఎలాంటి తీర్చలేని సమస్యలు లేవు. చిన్న అంశాలపై అభిప్రాయ భేదాలు వస్తుంటాయి. అవి సాధారణమే తప్ప, ఆందోళన కలిగించేవి కావు'' అని ఇన్వెస్టర్ కాల్‌లో మిస్త్రీ భరోసా ఇచ్చారు. తన రాజీనామా లేఖలో లేవనెత్తిన ఆందోళనలపై చక్రబర్తి నుంచి బోర్డ్‌కు పూర్తి వివరాలు అందలేదని పేర్కొన్నారు. బ్యాంకుపై మదుపర్ల విశ్వాసాన్ని బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటామని హెచ్‌డీఎఫ్‌సీ సీఈఓ శశిధర్ జగదీషన్ వాటాదారులతో వెల్లడించారు.

### ఆర్‌బీఐ ఏమందంటే..?

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. బ్యాంక్ గవర్నెన్స్‌కు సంబంధించి ఎలాంటి తీవ్రమైన ఆందోళనలు లేవని పేర్కొంది. బ్యాంక్ వద్ద తగినంత మూలధనం ఉందని, దాని ఆర్థిక స్థితి సంతృప్తికరంగా ఉందని తెలిపింది.

### ఫెడ్ ఎఫెక్ట్.. మరింత దిగొచ్చిన బంగారం, వెండి ధరలు



భౌగోళిక ఉద్రిక్తతల వేళ భారీగా పెరిగే స్వభావం కలిగిన బంగారం, వెండి యూటర్న్ తీసుకుంటున్నాయి. డాలరు బలోపేతం కావడం, అమెరికాలో ట్రెజరీ బాండ్లపై రాబడులు పెరగడంతో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే వీటి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. తాజాగా ద్రవ్యోల్బణ భయాల నేపథ్యంలో వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచుతూ అమెరికా ఫెడ్ తీసుకున్న నిర్ణయం వీటి ధరలపై మరింత ప్రభావం చూపింది. వడ్డీ రేట్లు అధిక స్థాయిలో ఉన్నప్పుడు బంగారం, వెండి వైపు పెట్టుబడులు తగ్గుతాయని, ఈ కారణంగానే అంతర్జాతీయంగా వీటి ధరలు దిగొచ్చాయని అనలిస్టులు పేర్కొంటున్నారు. దీన్ని అనుసరించి దేశీయంగానూ బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి.మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో ఏప్రిల్ కాంట్రాక్ట్ కిలో వెండి ఒక్కరోజులోనే 8 శాతం మేర పతనమైంది. ఏకంగా రూ.19 వేలు మేర తగ్గి రూ.2.29 లక్షలకు చేరింది. బంగారం సైతం 4 శాతం మేర తగ్గుముఖం పట్టింది. 10 గ్రాముల బంగారం ఏప్రిల్ నెల డెలివరీ దాదాపు రూ.6 వేలు మేర క్షీణించి రూ.1.46 లక్షలకు చేరింది.అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో నిన్నటి వరకు 5 వేల డాలర్ల వద్ద ట్రేడవుతూ వచ్చిన బంగారం ఔన్సు ధర ప్రస్తుతం 4,682 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి సైతం ఔన్సు 70 డాలర్ల వద్ద కొనసాగుతోంది. సాయంత్రం 4.50 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.1.52 లక్షలు పలుకుతోంది. వెండి కిలో రూ.2.36 లక్షలుగా ఉంది.

# టాటా వాణిజ్య వాహనాల ధరల పెంపు

**న్యూఢిల్లీ: ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ తన వాణిజ్య వాహనాల ధరలను పెంచేందుకు సిద్ధమైంది. ఈ ఏప్రిల్ 1 నుంచి అన్ని కమర్షియల్ వాహనాలపై 1.50 శాతం వరకు ధరలు పెంచుతున్నట్టు ప్రకటించింది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెంపు పరిధి మారుతుందని పేర్కొంది.**

**ముడి సరుకుల ధరలు, ఇతర ఇన్‌పుట్ ఖర్చులు పెరగడంతో వాటి ప్రభావాన్ని కొంత మేర తగ్గించుకునేందుకు ఈ ధరల పెంపు చేపడుతున్నట్టు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. 180 బిలియన్ డాలర్ల టాటా గ్రూప్‌లో భాగమైన టాటా మోటార్స్, దేశంలో యుటిలిటీ వాహనాలు, పికప్ వాహనాలు, ట్రక్కులు, బస్సుల తయారీలో అతిపెద్ద సంస్థగా ఉంది.**



# రూ.2,929 కోట్ల బ్యాంకు మోసం.. సీబీఐ ఎదుట అనిల్ అంబానీ



రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) నిధుల మళ్లింపు కేసులో రిలయన్స్ గ్రూప్ అధినేత అనిల్ అంబానీ గురువారం సీబీఐ ఎదుట హాజరయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదు మేరకు నమోదైన రూ.2929.05 కోట్ల బ్యాంకు మోసం కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఆయన్ని సుదీర్ఘంగా ప్రశ్నించింది.

నిధుల మళ్లింపుపైనే ప్రధాన దృష్టి
తెల్లవారుజామునే ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న అనిల్ అంబానీని ఆర్‌కామ్‌కు కేటాయించిన రుణాల వినియోగంపై అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. కంపెనీ అవసరాల కోసం తీసుకున్న రుణాలను ఇతర అవసరాలకు మళ్లించడం, నిధుల దుర్వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక లావాదేవీలు జరిపారనే ఆరోపణలున్నాయి. ఎస్‌బీఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత ఏడాది ఆగస్టులో అనిల్ అంబానీపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. అనిల్ అంబానీ ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం.. మార్చి 19, 20 తేదీల్లో ఆయన దర్యాప్తు సంస్థ ముందు విచారణకు హాజరు అవుతున్నారు.

ముగిసిన 'జై అన్మోల్' విచారణ
ఇదే క్రమంలో అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్ అంబానీని కూడా సీబీఐ వదిలిపెట్టలేదు. రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్)లో జరిగిన రూ.228.06 కోట్ల ఆర్థిక అవకతవకలపై గత వారం (మార్చి 14, 2026) ఆయన్ను అధికారులు విచారించారు. 'చట్టబద్ధమైన దర్యాప్తు సంస్థలకు పూర్తి స్థాయిలో సహకరించేందుకు అనిల్ అంబానీ కట్టుబడి ఉన్నారు. అందులో భాగంగానే ఈ విచారణకు హాజరవుతున్నారు' అని అనిల్ అంబానీ అధికార ప్రతినిధి చెప్పారు.

ఈ కేసులో మరికొంతమంది ప్రభుత్వ అధికారులు, రిలయన్స్ గ్రూప్ మాజీ ఉన్నతాధికారుల పాత్రపై కూడా సీబీఐ ఆరా తీస్తోంది. ఇప్పటికే జై అన్మోల్ నివాసాల్లో సోదాలు నిర్వహించిన అధికారులు, తాము సేకరించిన డాక్యుమెంట్ల ఆధారంగా విచారణను వేగవంతం చేశారు.

## 'పెద్ది' గ్రౌండ్‌లో తిలక్‌వర్మ



'పెద్ది' కొట్టిన షాట్‌ని ప్రచార చిత్రంలో చూసి క్రికెట్ ప్రేమికులంతా ఫిదా అయిపోయారు. తన షాట్ మాత్రమే కాదు, తన బ్యాట్ కూడా ఎంతో ప్రత్యేకం. ఆ బ్యాట్‌ని చేతపట్టుకుని మురిసిపోయారు భారత క్రికెటర్ తిలక్‌వర్మ. తెలుగువాడైన ఈయన ఇటీవల టీ20 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడు. ఆయన ఇటీవల 'పెద్ది' సినిమా సెట్‌ని సందర్శించారు. చిత్రీకరణ జరుగుతున్న సమయంలో తిలక్‌వర్మ సెట్లోకి రావడం చూసి చిత్రబృందమంతా ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, అభినందనలు చెప్పింది. సెట్ మొత్తం తిరిగిచూసిన తిలక్‌వర్మ, కథానాయకుడు రామ్‌చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా, ఇతర చిత్రబృందంతో ప్రత్యేకంగా ముచ్చటించారు. అనంతరం పెద్ది బ్యాట్‌ని చేతపట్టుకుని చూశారు. రామ్‌చరణ్ 'పెద్ది' బ్యాట్‌ను తిలక్‌వర్మకు బహుమతిగా ఇచ్చారు. క్రీడానేపథ్యంలో సాగే ఈ సినిమాలో రామ్‌చరణ్, జాన్వీకపూర్ జంటగా నటిస్తున్న సంగతి తెలిసిందే. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## 'ది బ్లాక్ గోల్డ్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్న సంయుక్త మీనన్

నటి సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా 'ది బ్లాక్ గోల్డ్' షూటింగ్ శరవేగంగా తుది దశకు చేరుకుంది. యోగేశ్ కేఎంసీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను ఈ ఏడాది జూన్ లేదా జూలైలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత రాజేశ్ దండా వెల్లడించారు. ఇటీవల ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆయన సినిమా విశేషాలు పంచుకున్నారు. "గన్ పట్టుకున్న పోలీస్ ఆఫీసర్‌కు, గన్ మాత్రమే వాడే విలన్‌కు మధ్య జరిగే కథ ఇది. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్నాం. సంయుక్త కెరీర్‌లో ఇది చాలా కొత్త తరహా పాత్ర అవుతుంది" అని ఆయన వివరించారు. సినిమాకు సంబంధించి ఇంకా ఐదు రోజుల టాకీ పార్ట్ మాత్రమే మిగిలి ఉందని, పోస్ట్‌ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా ఓ పవర్‌ఫుల్, ఫియర్స్ కాప్ అవతార్‌లో కనిపించనున్నారు. ఇప్పటికే నూతన సంవత్సరం సందర్భంగా విడుదల చేసిన ఆమె పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. హస్య మూవీస్, మగంటి పిక్చర్స్ పతాకాలపై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇందులో మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్, మనీష్ వాధ్వా, రాంకీ వంటి భారీ తారాగణం నటిస్తోంది. రొటీన్ యాక్షన్ డ్రామాలకు భిన్నంగా, సరికొత్త కథనం, ఊహించని మలుపులతో ఈ సినిమా ఉండనుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఏకకాలంలో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# అనుష్క పెళ్లి రూమర్స్..

## క్లారిటీ ఇచ్చిన టీమ్



గత కొన్ని రోజులుగా నటి అనుష్క పెళ్లి వార్త సోషల్ మీడియాలో చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఆమె ఓ వ్యాపారవేత్తతో పెళ్లిపీటలెక్కనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై ఆమె టీమ్ స్పందించింది. ఆ వార్తలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది . "ఒకరి వ్యక్తిగత జీవితాన్ని రోజువారీ ముఖ్యాంశాలుగా మార్చే ముందు కనీసం అది అధికారికమా, కాదా.. అని కూడా చూడడం లేదు. ఊహించడం, అంచనా వేయడం, అనధికారిక సమాచారాన్ని పదేపదే ప్రచురించడం సరైన పద్ధతి కాదు. అన్నిటికంటే నిరాశ కలిగించే విషయం ఏమిటంటే.. ఆమె వయసుపై అనవసరమైన శ్రద్ధ చూపడం. ప్రతి పోస్ట్‌లోనూ '44' అనే నంబర్‌ను ఏదో వివాదాస్పదమైన అంశంలా ఎందుకు హైలైట్ చేస్తున్నారు? వయసు అంత పెద్ద సమస్య అయితే.. హీరోల వయసు విషయంలో కూడా ఇదే ఉత్సాహం ఎందుకు కనిపించడం లేదు? మహిళల విషయంలోనే ఈ కథనం ఎందుకు భిన్నంగా ఉంటుంది?" అని టీమ్ ప్రశ్నించింది."అనుష్క శెట్టి తన కెరీర్‌ను గౌరవం, ప్రతిభతో హుందాగా నిర్మించుకున్నారు. ఆమె ఎప్పుడూ పీఆర్ స్టంట్స్‌పై ఆధారపడలేదు. తన వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచుకోవాలని కోరుకునే వ్యక్తిని ఇలా టార్గెట్ చేయడం అన్యాయం. ప్రతిఒక్కరూ తమ జీవితంలో జరిగే విషయాలను అందరికీ చెప్పాలని అనుకోరు. ఆ నిర్ణయాన్ని గౌరవించాలి. వివాహం అనేది వ్యక్తిగత విషయం. ఇది బ్రేకింగ్ న్యూస్ కాదు, ట్రెండ్ కాదు, కేవలం వ్యూస్ కోసం సెన్సేషనలైజ్ చేయాల్సిన విషయం అంతకంటే కాదు. ఇకనైనా బాధ్యతగా వ్యవహరించండి. హద్దులను గౌరవించండి. ప్రచురించే ముందు నిజాన్ని నిర్ధరించుకోండి. ముఖ్యంగా హీరోయిన్‌లను కూడా హీరోలతో సమానంగా గౌరవంగా చూడండి" అని టీమ్ పేర్కొంది.

## ఉస్తాద్ భగత్ సింగ్.. పవన్‌కల్యాణ్ కొత్త చిత్రం మెప్పించిందా?





**చిత్రం: ఉస్తాద్ భగత్ సింగ్; నటీనటులు: పవన్‌కల్యాణ్, రాశీఖన్నా, శ్రీలీల, ఆర్.పార్తిబన్, అషుతోష్ రాణా, నవాబ్ షా, రాజీవ్ కనకాల, రావు రమేశ్ తదితరులు; సంగీతం: దేవిశ్రీ ప్రసాద్; నేపథ్య సంగీతం: తమన్; సినిమాటోగ్రఫీ: అయాంక బోస్; ఎడిటింగ్: కార్తిక్ శ్రీనివాస్; నిర్మాత: నవీన్ యెర్నేని, వై.రవి శంకర్; కథ, దర్శకత్వం: హరీశ్ శంకర్; విడుదల:**

సినీ ప్రేక్షకులు, అభిమానులు ఎప్పటి నుంచో వేచి చూస్తున్న చిత్రాల్లో 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒకటి. పైగా 'గబ్బర్ సింగ్' తీసిన హరీశ్ శంకర్ దర్శకత్వంలో వస్తుండటంతో అంచనాలు ఏర్పడ్డాయి. మరి వాటిని 'ఉస్తాద్' అందుకున్నాడా? పవన్‌కల్యాణ్ హరీశ్ కాంబో హిట్ అందుకుందా?

**కథేంటంటే..**

నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడకు పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలీ పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్‌ని దెబ్బ కొట్టేందుకు నాగప్ప ఏం చేశాడు ?ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు? అన్నది చిత్ర కథ.

**ఎలా ఉందంటే..**

పవన్ కల్యాణ్ హరీశ్ శంకర్ కలయికలో సినిమా అనగానే ప్రేక్షకులు 'గబ్బర్‌సింగ్'ని గుర్తు చేసుకుంటారు. పవన్‌కల్యాణ్‌ని ఎలా చూపిస్తే ఆయన అభిమానులకూ, సామాన్య ప్రేక్షకులకు నచ్చుతుందో పక్కాగా అలాగే చూపించారు. చాలా సంవత్సరాల తర్వాత ఆ ఇద్దరూ కలిసి సినిమా చేస్తున్నప్పుడు మళ్లీ అదే స్థాయి అంచనాలు ఏర్పడటం సహజం. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే దర్శకుడు హరీశ్ శంకర్ కథపై కంటే కూడా, పవన్‌కల్యాణ్ మార్క్ అంశాలపైనే ప్రధానంగా దృష్టిపెట్టి ఈ సినిమాని తెరకెక్కించారు. లుక్ మొదలుకొని పవన్ మేనరిజమ్స్, సంభాషణలు, పొలిటికల్ ఇమేజ్ ఇలా ఇంచుమించు గబ్బర్‌సింగ్‌లాగే దమ్ము చూపించే పోలీస్ పాత్ర, ఎలివేషన్స్‌ని పక్కాగా మేళవించి సినిమాని తెరకెక్కించారు. కథ, కథనం పరంగా చూస్తే సగటు తెలుగు కమర్షియల్ సూత్రాలకు తగ్గట్టే సాగుతుంది. ఏమాత్రం కొత్తదనం కనిపించదు. సాధారణ ప్రేక్షకులు ఆ విషయంలో కాస్త అసంతృప్తి చెందుతారేమో కానీ, అభిమానులకు మాత్రం ఇందులోని పవన్‌కల్యాణ్ మరింతగా నచ్చేస్తాడు. ఇటీవల వచ్చిన 'ఓజీ' కూడా అభిమానుల్ని మెప్పించే అంశాలతోనే రూపొందినా... ఆ నేపథ్యం, అందులో కనిపించిన పవన్‌కల్యాణ్ వేరు. ఈ సినిమాలో చాలా రోజులుగా అభిమానులు చూడని వింటేజ్ పవన్‌కల్యాణ్‌ని చూపించారు హరీశ్ శంకర్. భగత్ సింగ్‌గా పవన్ తెరపై కనిపించినప్పటి నుంచి అసలు వినోదం, డ్రామా మొదలవుతాయి. డ్యాన్స్ ఎపిసోడ్, కాలరే ఎత్తరా పాట, మరోవైపు అడవిలోకి వచ్చిన నల్ల నాగప్ప గ్యాంగ్ నేపథ్యంలోని సన్నివేశాలతో సినిమా సరదాగా, అదే సమయంలో ఆసక్తిని రేకెత్తిస్తూ ముందుకు సాగుతుంది. 'సినిమాతో మంచి చెప్పే అవకాశం వచ్చిందంటే నేను అస్సలు వదులుకోను' అని చెప్పే దర్శకుడు హరీశ్ శంకర్ ఇందులో డిప్రెషన్, దేశభక్తి, సోషల్ మీడియానే జీవితం అనుకుంటూ నలిగిపోయే జీవితాల గురించీ మరిన్ని సంభాషణలు రాసి పవన్‌కల్యాణ్‌తో చెప్పించారు. ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ మొదలవడంతో కథలోని అసలు సిసలు మాస్ కోణం బయటికొస్తుంది. ఖాకీ డ్రెస్‌లో గబ్బర్‌సింగ్‌ని గుర్తు చేస్తూ పవన్ సందడి చేస్తారు. రథయాత్ర ఎపిసోడ్, విలన్‌కి వార్నింగ్ ఇచ్చే సన్నివేశాలు కథలో వేడిని పెంచుతాయి. ద్వితీయార్ధం సినిమాకి మరింత బలం. పాత బస్తీ ఎపిసోడ్‌తో పాటు, పవన్‌కల్యాణ్, శ్రీలీల మధ్య సాగే సరదా సన్నివేశాలు, ఈ మనసే.. రీమిక్స్ గీతం, అది తెరకెక్కించిన విధానం, అదే ఎపిసోడ్‌లోని భావోద్వేగ కోణం సినిమాకి హైలైట్. పతాక సన్నివేశాలూ మెప్పిస్తాయి. కథ, కథనాలు చాలా వరకూ ఊహకు తగ్గట్టుగానే సాగినా.. పవన్‌కల్యాణ్ హీరోయిజం, ఆయన మాస్ హంగామా, ఆయన ప్రజాజీవితాన్ని, అభిమాన బలాన్ని గుర్తు చేసేలా సంభాషణలు కట్టిపడేస్తూ మిగతా విషయాలేవీ గుర్తుకు రాకుండా చేయడం ఈ సినిమా ప్రత్యేకత.

**ఎవరెలా చేశారంటే...**

ఈ కథ, పాత్రల్లో కొత్త కాకపోయినా పవన్‌కల్యాణ్ (Pawan Kalyan) శైలి వినోదం, మాస్ అంశాలు ఇందులో పుష్కలంగా ఉండటంతో ఆయన మరింత హుషారుగా నటించారు. సాధారణ సన్నివేశాల్ని సైతం మరో స్థాయికి తీసుకెళ్లారు. రాశీఖన్నా సందడి ప్రథమార్ధంలోనే. శ్రీలీలకి ప్రాధాన్యమున్న పాత్ర దక్కింది. ఆమె మనసే పాటలో కనిపించిన విధానం ఆకట్టుకుంటుంది. సెకండాఫ్‌లో ఆమె పాత్ర నేపథ్యంలో వచ్చే కీలక మలుపు భావోద్వేగాల్ని పంచుతుంది. ప్రధాన ప్రతినాయకుడిగా పార్తిబన్ కనిపించిన తీరు బాగుంది. నల్లనాగప్ప పాత్రపై ఆయన బలమైన ప్రభావమే చూపించారు. కె.ఎస్.రవికుమార్, రావు రమేశ్ కీలకమైన పాత్రల్లో కనిపిస్తారు. గౌతమి, సత్యం రాజేశ్, ప్రభాస్ శ్రీను, ప్రవీణ్ తదితరులు అలవాటైన పాత్రల్లో కనిపిస్తారు. దేవిశ్రీప్రసాద్ పాటలు బాగున్నాయి. తమన్ నేపథ్య సంగీతం సినిమాపై బలమైన ప్రభావం చూపించింది. ఎడిటింగ్‌తో పాటు ఇతర విభాగాలూ మంచి పనితీరునే కనబరిచాయి. దర్శకుడు హరీశ్ శంకర్ ఒక పక్కు కమర్షియల్ కథకే తనదైన మార్కు సంభాషణలు, హీరో పాత్రకు ఎలివేషన్లు డిజైన్ చేసి సినిమాను ఆవిష్కరించారు.

'ది ప్యారడైజ్' నుంచి మోహన్ బాబు బర్త్‌డే ట్రీట్..

## నాని సినిమాలో క్రూరమైన పాత్రలో కలెక్షన్ కింగ్




లెజెండరీ నటుడు, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న భారీ పాన్‌ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి చిత్రయూనిట్ ఓ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ సినిమాలో మోహన్ బాబు అత్యంత శక్తిమంతమైన విలన్ పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రంలో మోహన్ బాబు 'శికంజా మాలిక్' అనే పవర్‌ఫుల్, డార్క్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. ఆయన పుట్టినరోజున శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం విడుదల చేసిన వీడియోలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ తరం వారికి అసలు సిసలు మోహన్ బాబు అంటే తెలియదు. 'ప్యారడైజ్' సినిమాతో మోహన్ బాబు అంటే ఏంటో చూపిస్తాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ మాటలతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

## అట్టహాసంగా గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం




ఉగాదిని పురస్కరించుకుని తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం (Telangana Gaddar Film Awards Ceremony) అట్టహాసంగా జరిగింది. మాదాపూర్ హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ ఈ వేడుకకు వేదికైంది. తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ నటుడు చిరంజీవి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికెట్ పొందిన చిత్రాలకు సంబంధించి ఇప్పటికే విజేతల వివరాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. వారిలోని పలువురికి డిప్యూటీ సీఎం పురస్కారాలు అందజేశారు. ప్రశంసా పత్రంతోపాటు నగదు ప్రోత్సాహకాన్ని విజేతలు అందుకున్నారు. జ్యూరీ కమిటీకి గోల్డెన్ మెమెంటో, ప్రశంసా పత్రంతోపాటు రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని టీఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు అందజేశారు.

# మీ వల్లే ధోని ఇప్పుడీ స్థాయికి..



టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని సతీమణి సాక్షి ఇన్స్టా గ్రామ్ వేదికగా స్పెషల్ పోస్టు పెట్టారు. తన మామయ్య పాన్ సింగ్ ధోనికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన భర్త సక్సెస్ వెనుక కీలక పాత్ర పోషించారని.. నిరంతరం మీ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు సాక్షి పేర్కొన్నారు. తాను కెరీర్‌లో ఎదగడంలో తన తల్లిదండ్రులదే ముఖ్య భూమిక అని ధోని తరచూ ప్రకటించే విషయం తెలిసిందే. "ధైర్య సాహసాలతో ఒంటరిగా మీరు చిన్న వయసులోనే గ్రామాన్ని వీడారు. నేడు దేశమంతా గౌరవించే ఓ గొప్ప వారసత్వాన్ని నిర్మించారు. మీ జర్నీ అందరికీ స్ఫూర్తిదాయకం. నా మనిషి (ధోని) విజయం వెనుక బలం మీరే. కేవలం మీ వల్లే ఆయన ఈ స్థాయిలో ఉన్నారు. ఎల్లవేళలా మేమంతా మిమ్మల్ని ప్రేమిస్తూనే ఉంటాం. హ్యాపీ బర్త్‌డే" అంటూ సాక్షి పోస్టు పెట్టారు.

# యుద్ధం ఎఫెక్ట్.. క్రికెట్ బంతికీ కష్టమొచ్చింది!




అమెరికాఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు కొత్త చిక్కును తీసుకొచ్చేలా ఉంది. మరికొద్ది రోజుల్లో కొత్త సీజన్ ప్రారంభం కానున్న వేళ.. ఈసీబీని డ్యూక్ బంతుల కొరత వెంటాడనుంది. గల్ఫ్ నుంచి వెళ్లే రవాణా మార్గాలకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో ఉపఖండం నుంచి యూకేకు సరఫరా క్లిష్టంగా మారింది. విమానాల్లో సరకు రవాణా చేయించాలంటే ప్రస్తుతం వెచ్చిస్తోన్న దానికంటే మూడు రెట్లు అధికమొత్తం చెల్లించాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఉన్న సాధారణ కోటాలో డ్యూక్ బంతులు సగమే అందుబాటులో ఉన్నట్లు ఈసీబీ వర్గాలు వెల్లడించాయి. యుద్ధం ఇలానే కొనసాగితే.. రాబోయే నెలల్లో మ్యాచ్‌ల సన్నద్ధతకు ఇబ్బందులు తప్పవని ఈసీబీ ఆందోళన చెందుతోంది.
ఏప్రిల్ 3 నుంచి ఇంగ్లాండ్ క్రికెట్ కొత్త సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే బంతుల కొరత వెంటాడుతోంది. డ్యూక్స్ బంతులను స్వదేశంలో జరిగే టెస్టులతోపాటు కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో వినియోగిస్తారు. తయారీదారు బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ సంస్థ ఓనర్ దిలీప్ జజోడియా స్పందిస్తూ.. "మున్ముందూ ఇలాగే కొనసాగితే బంతుల కొరత తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే 13 ఫస్ట్ క్లాస్ క్లబ్‌లకు సరఫరా తగ్గించినట్టు తెలియజేశాం. ఉపఖండంలోని ఫ్యాకర్టీల్లో సరకు రెడీగా ఉంది. కానీ, షిప్పింగ్ సమస్యగా మారింది. అక్కడ నుంచి తెప్పించేందుకు విమానయాన సంస్థలను సంప్రదించినా ఫలితం లేకుండాపోతోంది" అని వెల్లడించారు.

**ఐపీఎల్‌కు ఏమైనా సమస్యలా?**

ఇప్పటి వరకైతే భారత్‌లో జరగనున్న ఐపీఎల్‌కు బంతుల కొరత పెద్దగా లేదు. మెల్‌బోర్న్‌లోని కూకబుర్రా సంస్థ తెల్ల బాల్స్‌ను తయారు చేస్తుంది. ఇప్పటికే ఐపీఎల్ నిర్వాహకులు పెద్ద మొత్తంలో బంతులను తెచ్చి సిద్ధంగా ఉంచినట్లు సమాచారం. మార్చి 28 నుంచి ఐపీఎల్ 2026సీజన్ ప్రారంభం కానుంది. తొలుత 20 మ్యాచులకు షెడ్యూల్‌ను ఐపీఎల్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# క్వార్టర్స్‌లో తాన్వి, మాళవిక



ఓర్లియాన్స్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ తాన్వి శర్మ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల సింగిల్స్‌లో గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో తాన్వి 21-14, 21-17తో భారత్‌కే చెందిన అన్‌మోల్ ఖర్బ్‌ను ఓడించింది. ఇతర మ్యాచ్‌లలో ఇషారాణి బారువా 21-11, 14-21, 21-17తో వెన్ యు జాంగ్ (కెనడా) పై, మాళవిక బన్సోద్ 24-22, 21-13తో వాంగ్ లింగ్ చింగ్ (మలేసియా)పై, నెగ్గి ముందంజ వేశారు. పురుషుల డబుల్స్‌లో భారత జోడి హరిహరన్ - ఎంఆర్ అర్జున్ 26-24, 21-14తో అలెగ్జాండర్ డున్ - ఆడమ్ ప్రింగిల్ (స్కాట్లాండ్)ని ఓడించి క్వార్టర్స్‌కు చేరింది. పురుషుల సింగిల్స్‌లో 21-9, 18-21, 9-21 స్కోరుతో యుడై ఒకొమొటో (జపాన్) చేతిలో ఓటమితో ఆయుశ్ శెట్టి (భారత్), మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జంట గద్దె రుత్విక శివాని - రోహన్ కపూర్ 21-19, 9-21, 14-21తో టాప్ సీడ్ థామ్ గిక్వెల్ - డెల్‌ఫైన్ డెల్‌ర్యూ (ఫ్రాన్స్) చేతిలో ఓడి నిష్క్రమించారు.

# తొలి టైటిల్ వేటలో...



పేర్లు మారినా... ప్లేయర్లు మారినా.. ఆ రెండు జట్ల రాత మాత్రం మారడం లేదు. ఐపీఎల్ ఆరంభం నుంచి పోటీ పడుతున్నా... ఇప్పటి వరకు ఆ రెండు జట్లకు ట్రోఫీ అందని ద్రాక్షలా ఊరిస్తూనే ఉంది. అందులో ఒకటి శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని పంజాబ్ కింగ్స్... మరొకటి అక్షర్ పటేల్ నాయకత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్.
గత సీజన్‌లో జట్లను ప్రక్షాళన చేసుకొని కొత్తగా దర్శనమిచ్చిన ఈ రెండు టీమ్‌లు మెరుగైన ప్రదర్శనే చేశాయి. బెంగళూరుతో జరిగిన ఫైనల్లో తడబడిన పంజాబ్ కింగ్స్ రన్నరప్‌తో సరిపెట్టుకోగా... ఢిల్లీ క్యాపిటల్స్ ఐదో స్థానానికి పరిమితమైంది. చరిత్రను పక్కనపెట్టి ఇరు జట్లు ఈసారి ఎలాంటి ప్రదర్శన కనబరుస్తాయో చూడాలి!
: ఏళ్లకు ఏళ్లుగా తొలి టైటిల్ సాధించాలనే తపనతో సాగుతున్న పంజాబ్ కింగ్స్ జట్టు గత ఏడాది మెరుగైన ఆటతీరు కనబర్చింది. లీగ్ దశలో తొమ్మిది మ్యాచ్‌ల్లో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానం దక్కించుకుంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యానికి సహచరుల సహకారం తోడవడంతో... పంజాబ్ తొలి టైటిల్ గెలిచేలా కనిపించింది. అయితే బెంగళూరుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సారథి విఫలమవడం ఫలితంపై ప్రభావం చూపింది.
గత సీజన్‌లో ఆడిన జట్టులో పెద్దగా మార్పులు చేయని పంజాబ్... ఈసారి ఎలాగైనా తమ చిరకాల కోరిక తీర్చుకోవాలని భావిస్తోంది. గత సీజన్‌లాగే బలంగా కనిపిస్తున్న కింగ్స్... మైదానంలో మళ్లీ మ్యాజిక్ చేసేందుకు రెడీ అవుతోంది. హెడ్ కోచ్ రికీ పాంటింగ్ పంజాబ్‌కు ప్రధాన బలం కాగా... జట్టు ఆల్‌రౌండర్‌లతో కిక్కిరిసి ఉంది. ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఇన్నింగ్స్ ప్రారంభించనుండగా... శ్రేయస్ అయ్యర్ నాలుగో స్థానంలో ఇన్నింగ్స్‌కు స్థిరత్వం తేనున్నాడు.
విదేశీ ప్లేయర్ల కోటాలో... స్టొయినిస్, యాన్సెన్, అజ్మతుల్లా, ఫెర్గూసన్ కీలకం కానున్నారు. సీజన్ మొత్తం ఈ నలుగురినే కొనసాగించే అవకాశాలున్నాయి. నేహల్ వధేరా, శశాంక్ సింగ్, ముషీర్ ఖాన్ రూపంలో మిడిలార్డర్‌లో ధాటిగా ఆడగల భారత ఆటగాళ్లు అందుబాటులో ఉండటం పంజాబ్‌కు కలిసి రానుంది. బౌలింగ్‌లో అర్షదీప్ సింగ్ జట్టు ప్రధాన బలం కాగా... యుజ్వేంద్ర చహల్, స్టొయినిస్, యాన్సెన్, అజ్మతుల్లా మిగతా భారం మోయనున్నారు. ఆంధ్ర ఆటగాడు పైలా అవినాశ్‌కు తుది జట్టులో అవకాశం దక్కుతుందా చూడాలి.
పంజాబ్ కింగ్స్ జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్ ), నేహల్ వధేరా, విష్ణు వినోద్, హర్‌నూర్ పన్ను, పైల అవినాశ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, శశాంక్ సింగ్, స్టొయినిస్, హర్‌ప్రీత్ బ్రార్, యాన్సెన్, అజ్మతుల్లా, ప్రియాన్ష్ ఆర్య, ముషీర్ ఖాన్, సూర్యాన్ష్, ఓవెన్, కొనొల్లీ, ద్వార్షుయ్, అర్ష్ దీప్, చహల్, వైశాక్, యశ్ ఠాకూర్, జేవియర్, ప్రవీణ్ దూబే, విశాల్ నిషాద్, ఫెర్గూసన్.
అత్యుత్తమ ప్రదర్శన: రన్నరప్ (2014, 2025)

**'మద్యం మానేశా'**

ప్రస్తుతం నా వయసు 35 ఏళ్లు. సీనియర్ ఆటగాడిగా చహల్‌ను చూసి ఎవరైనా ఏదైనా నేర్చుకోవాలని అనుకోవాలి. మైదానంలో మరింత చురుగ్గా ఉంటూ జట్టు కోసం 150 శాతం శ్రమించాలని పట్టుదలగా ఉన్నా. అందుకే నా శరీరంపై మరింత దృష్టి పెట్టా. గత ఆరు నెలలుగా మద్యం మానేశాననే శుభవార్త మీతో పంచుకుంటున్నా. - చహల్, పంజాబ్

**ఢిల్లీ రాత మారేనా!**

ఐపీఎల్ చరిత్రలో ఒకే ఒక్కసారి (2020 సీజన్‌లో) ఫైనల్‌కు చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు... గతేడాది టీమ్‌లో సమూల మార్పులు చేసింది. టీమిండియా స్టార్ కేఎల్ రాహుల్ సారథ్యానికి మొగ్గు చూపకపోవడంతో... అక్షర్ పటేల్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. అందుకు తగ్గట్లే అక్షర్ అటు బ్యాట్‌తో, ఇటు బంతితో మెరుగైన ప్రదర్శనే కనబర్చాడు. అయితే లీగ్ దశలో ఏడు మ్యాచ్‌ల్లో గెలిచిన క్యాపిటల్స్.. ప్లే ఆఫ్స్‌కు చేరడంలో విఫలమైంది. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గి ప్రత్యర్థులను భయపెట్టిన ఢిల్లీ... ఆ తర్వాత అదే జోరు కొనసాగించడంలో విఫలమైంది. కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, డేవిడ్ మిల్లర్, స్టబ్స్, పృథ్వీ షా వంటి ప్లేయర్లతో టాపార్డర్ బలంగా ఉండగా... మిడిలార్డర్‌లో అశుతోష్ రాణా, సమీర్ రిజ్వీ, అక్షర్ పటేల్, విప్రాజ్ నిగమ్ కీలకం కానున్నారు. పేరున్న స్టార్‌ల కన్నా... సమయానుకూలంగా రెచ్చిపోగల ప్లేయర్లు ఉండటం క్యాపిటల్స్‌కు అదనపు బలం కానుంది. ఆంధ్ర ప్లేయర్ త్రిపురాన విజయ్‌ను ఆడిస్తారా అనేది ఆసక్తికరం. విదేశీ ప్లేయర్ల కోటాలో మిచెల్ స్టార్క్, మిల్లర్, స్టబ్స్, డకెట్ , ఎంగిడి, జెమీసన్ అందుబాటులో ఉన్నారు.
అయితే అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన కనబర్చిన పేస్ ఆల్‌రౌండర్ లేకపోవడం కాస్త లోటే. బౌలింగ్‌లో ముకేశ్ కుమార్, నటరాజన్, కుల్దీప్ యాదవ్ కీలకం కానున్నారు. దేశవాళీ సెన్సేషన్ పేసర్ ఆఖిబ్ నబీ ఈ సారి అదనపు బలం కానున్నాడు. గత సీజన్ మాదిరిగానే సమష్టి ప్రదర్శనను నమ్ముకుంటే ఈ సారి క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్‌కు చేరొచ్చు. హేమాంగ్ బదానీ కోచింగ్, అక్షర్ పటేల్ కెప్టెన్సీ జట్టును ఎలా నడిపిస్తాయనేది కీలకం.
ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు: అక్షర్ పటేల్ (కెప్టెన్ ), కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, మిల్లర్, డకెట్ , నిశాంక, సాహిల్, పృథ్వీ షా, అభిషేక్ పొరెల్, స్టబ్స్, సమీర్ రిజ్వీ, అశుతోష్ రాణా, విప్రాజ్ నిగమ్, అజయ్ మండల్, త్రిపురాన విజయ్, మాధవ్ తివారి, ఆఖిబ్ నబీ, నితీశ్ రాణా, స్టార్క్, నటరాజన్, ముకేశ్ కుమార్, చమీర, ఎంగిడి. జెమీసన్, కుల్దీప్ యాదవ్.

# మెస్సీ @900 గోల్స్



(అమెరికా): అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాలర్ లయొనెల్ మెస్సీ మరో మైలురాయిని చేరుకున్నాడు. ఫుట్‌బాల్ కెరీర్‌లో 900 గోల్స్ సాధించిన అరుదైన ఆటగాడిగా నిలిచాడు. తద్వారా ఇప్పటిదాకా మరో స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డోకే పరిమితమైన '900 గోల్స్' జాబితాలో తాను భాగమయ్యాడు. కాన్ఫెడరేషన్ ఆఫ్ నార్త్, సెంట్రల్ అమెరికా అండ్ కరీబియన్ అసోసియేషన్ ఫుట్‌బాల్ (కాన్‌కకాఫ్) చాంపియన్స్ కప్‌లో ఇంటర్ మయామికి ప్రాతినిధ్యం వహిస్తున్న మెస్సీ... నష్ విల్లేతో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో గోల్ చేయడం ద్వారా '900' క్లబ్‌లో చేరాడు. బ్రెజిలియన్ దివంగత దిగ్గజం పీలే 1000 గోల్స్ చేసినట్లుగా ఉన్నప్పటికీ అధికారిక గోల్స్ స్కోరు మాత్రం సుమారు 800 మాత్రమే! ఎందుకంటే పీలే చేసిన వెయ్యి గోల్స్‌లో దిగువ స్థాయి మ్యాచ్‌ల్లో చేసినవి కూడా కలిపారు. దీంతో ఫుట్‌బాల్ విశ్లేషకుల లెక్కల ప్రకారం 900 క్లబ్‌లో ప్రస్తుతం రొనాల్డో, మెస్సీలు మాత్రమే ఉన్నారు.

# ఏఐ నిఘాలో ఆర్సీబీ హోంగ్రౌండ్ మ్యాచులు?



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గత ఐపీఎల్ సీజన్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే, చిన్నస్వామి స్టేడియంలో చోటు చేసుకున్న తొక్కిసలాట కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోవడం కలిచివేసింది. దీంతో ఈ సారి ఎడిషన్‌లో బెంగళూరులో మ్యాచుల నిర్వహణపై తొలుత సందిగ్ధత ఏర్పడింది. అయితే, కర్ణాటక ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రావడంతో మ్యాచుల నిర్వహణకు కర్ణాటక క్రికెట్ సంఘం సిద్ధమవుతోంది. ఈసారి మాత్రం భద్రతకు సంబంధించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో ప్రేక్షకుల కదలికలను నిరంతరం గమనించేందుకు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేస్తున్నట్లు కర్ణాటక క్రికెట్ సంఘం అధికారులు పేర్కొన్నారు. ఏ గేట్ వద్దనైనా ఎక్కువ మంది ప్రేక్షకుల తాకిడి ఉన్నట్లు ఏఐ డిటెక్ట్ చేస్తే.. వెంటనే పోలీసు సిబ్బంది చర్యలు మొదలుపెడతారు. అక్కడి గేట్లను మూసివేసి.. లోపల ఉన్న ప్రేక్షకులు సురక్షితంగా తమ సీట్ల వద్దకు వెళ్లేలా పరిస్థితిని సమీక్షిస్తారు. మరోవైపు ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజమ్‌నూ బలోపేతం చేయనున్నారు. చిన్నస్వామి స్టేడియం వద్ద గ్రీన్ కారిడార్‌నూ ఏర్పాటు చేస్తారు. అంబులెన్స్‌లు, ఫైర్ సర్వీస్, ఇతర అత్యవసర సర్వీసుల వాహనాలు వెళ్లేందుకు ప్రాధాన్యం ఇస్తారు. అవసరమైతే స్టేడియం వెలుపల వైద్య సదుపాయం కల్పించేలా చర్యలు